KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## అమరావతి
ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు
పల్నాడు | బాపట్ల | ప్రకాశం

ఆదివారం 24 మే 2026 పేజీలు: 16




- డబ్బే ప్రధానంగా అభ్యర్ధులను వెతుకుతున్న పార్టీలు
- స్థానిక పీఠానికే పరిమితమైన సామాన్యుడు
- స్థానిక పీఠంలో 50 శాతం ఇచ్చామంటూ పార్టీల ముక్తాయింపు

# పల్లకి మాది... పగ్గం మీది
## బీసీలే బతుకుదారు

- 2024 ఎన్నికల్లో బీసిలకు 30 శాతం లేని ప్రాతినిద్యం
- విప్లవాత్మక మార్పులు వస్తున్న నేపధ్యంలో నిశితంగా గమనం
- అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకుంటున్న 'బీసి' యువత

**మనసులో మాట బ్యూరో ఛీఫ్, అమరావతి:**

రాజకీయం..వినటానికి,కనటానికి చాలా సాఫ్టుగా ఉంటుంది. దాని లోతుల్లోకి వెళితే ధనవంతులకు 'కవచం'లా కన్నిస్తుంది. ఆధునిక రాజకీయ వ్యవస్థలో ధనవంతులే రాజకీయాలను శాసించే పరిస్థితి ఉందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. స్వాతంత్రం సిద్ధించిన దగ్గర నుంచి నేటి వరకు బీసీలు పార్టీలకు పల్లకిమోసే బోయిలుగా ఉన్నారు. అయితే గత రెండు దశాబ్దాలుగా రాజకీయంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపధ్యంలో సామాన్యుడి వస్తున్న రాజకీయ మార్పులకు అనుగుణంగా పార్టీలు తమ స్టాండును మార్చుకుంటున్నాయి. దీంతో బీసిలకు స్థానిక పీఠంపై 50 రిజర్వేషన్‌ను ఇచ్చి పదవులను కట్టబెడుతున్నారు. అదే విధంగా చట్ట సభలకు సైతం బీసీలను పంపించాలన్న డిమాండ్ అధికంగా వినిపిస్తోంది. 2021 లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 50 శాతంకు మించి ప్రధాన పార్టీలు అవకాశం కల్పించిన నేపధ్యంలో బీసిలకు కొంత ఊరట లభించిందని చెప్పవచ్చు. అయితే చట్ట సభలకు వీరికి అవకాశం మృగ్యమైన క్రమంలో 2024 ఎన్నికల్లో బీసీలకు 30 శాతం మాత్రమే ప్రాధాన్యత దక్కింది. కనీసం 50 శాతం ప్రాధాన్య నివ్వాలన్న డిమాండ్ బీసీ యువతలో రోజురోజుకు అధికమవుతోంది. జనాభాలో 60 శాతం ఓటర్లు ఉన్న క్రమంలో జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ సీట్లను కేటాయించాలన్న డిమాండ్ చేయాలని బిసీ సంఘాలు గత కొన్నేళ్ళుగా బీసీ నినదిస్తున్నాయి. ..మిగతా 2లో

# యువత మోడీని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలి
## కేంద్ర మంత్రి పెమ్మసాని



**మనసులో మాట బ్యూరో ఛీఫ్, అమరావతి:**

ప్రధానమంత్రి మోడీని యువత ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మంత్రి ప్రమోషన్ చంద్రశేఖర్ అన్నారు. భారతదేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇతర దేశాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని మంత్రి పెమ్మసాని కొనియాడారు.దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రధాన మంత్రి రోజ్ గార్ మేళా కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు లోని స్థానిక రైల్వే భవన్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ..మిగతా 2లో

# ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన కొండవీటి కోట


8

# అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం చేయాలి



3

- 2029 నాటికి రాష్ట్రాన్ని సంపూర్ణం అక్షరాస్య రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- జిల్లాలో ఈ ఏడాది 77,501 మందిని అక్షరాస్యులుగా చేయడమే టార్గెట్
- అంగన్వాడీ కేంద్రాల్లో సాయంత్రం తరగతులు నిర్వహణ
- డ్వాక్రా, శ్రామిక సంఘాల భాగస్వామ్యంతో ఉల్లాస్ కార్యక్రమం

మనసులో మాట

# పల్లకి మోది... పగ్గం మీది బీసీలే బతుకుదారు

(మొదటి పేజీ తరువాయి)

**1983 నుంచి విప్లవాత్మక మార్పులు:**
బడుగులకు రాజకీయ ప్రాధాన్యత 1983 నుంచే ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు రాకతో రాజకీయంలో విప్తవాత్మక మార్పులు తీసుకువచ్చారు. పాలన వ్యవస్థను ప్రజల ముంగిటకు తీసుకురావాలన్న భావనతో మండల వ్యవస్థను ప్రవేశపెట్టారు. అప్పటి వరకు పోటీ చేయలేని పరిస్థితిలో ఉన్న బీసి వర్గాలకు మండల వ్యవస్థలో చోటు కల్పించి రాజకీయ బిక్ష పెట్టారు. బీసిలు కూడా రాజకీయంలో తమ స్థానాన్ని పధిలం చేసుకునే దిశగా అడుగులు వేశారు.ఈ నేపధ్యంలో గత రెండు దశాబ్దాలుగా రాజకీయాలలో వస్తున్న మార్పులు బీలకు రాజకీయ పదవులను దగ్గరకు చేర్చిందని చెప్పవచ్చు.రాజకీయాలు మార్పులు సంతరించుకుటున్న క్రమంలో బీసిల ప్రాధాన్యత అధికమయింది. రాజకీయ చైతన్యం వస్తున్న కక్రమంలో యువత ఆలోచనలో కూడా మార్పులు వచ్చాయి. ఈనేపధ్యంలో చట్ట సభలలో కూడా అధిక బాగం బీసీలు అడుగు పెట్టాలన్న యోచనలో ఉన్నారు.ఇదిలా వుండగా,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన నేపధ్యంలో అప్పటి వరకు వంటింటికే పరిమితమైన మహిళలు రాజకీయ అరంగ్రేటం చేశారు. ఎంపిటీసీలు,జెడ్పిటీసిలు,ఎంపిపిలు,మున్సిఫల్ ఛైర్మన్లు,కౌన్సిలర్లు తదితర పదవవులను అలంకరించారు. ఈ నేపధ్యంలో అసెంబ్లీ సీట్ల పునర్విభజన కారణంగా సీట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది. పార్టీలు బీసీలను పరిగణలోకి తీసుకుని దమాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరుతున్నారు.

**డబ్బు ఉన్న వ్యక్తులకే సీటు ఇస్తున్న పార్టీలు:**
బీసీలే పార్టీలకు వెన్నెముక అని చెపుతున్న సందర్భములో పార్టీలు వారిని ఎప్పుడూ పల్లకి మోసే బోయిలుగానే చూస్తున్నారన్న భావన వ్యక్తమవుతోంది.బీసీలకు స్థఆనిక సంస్థల పదవులు అప్పజెబుతోన్న పార్టీలు చట్ట సభలకు మాత్రం రానివ్వడంలేదన్న వాదన విన్పిస్తుంది. ఆధునిక రాజకీయంలో డబ్బే పధ్రాన భూమిక పోషిస్తున్న తరుణంలో బీసిలకు సీట్లు ఇస్తే సీటు దక్కదన్న భావనలో పార్టీలు ఇతర సామాజిక వర్గాలకు సీట్లను కట్టబెడుతున్నాయి. ఈనేపధ్యంలో బీసిలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న సత్యాన్ని బిసి యువత గుర్తించింది. దీంతో చట్ట సభలకు దమాషా ప్రకారంగా సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిఇలావుండగా,2019 ఎన్నికల్లో మిగిలిన పార్టీలకంటే అధికంగా బీసిలకు సీట్లిచ్చి వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి శ్రీకారం చుట్టారు. అత్యంత బీదవారిని పార్లమెంటుకు పంపిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుంది. అనంతపురం జిల్లా హిందూపురం లోక్‌సభ స్థానానికి చిన్న బీసి సామాజిక వర్గం చెందిన సిఐ గోరంట్ల మాదవ్‌ను ఎంపిక చేసింది. అదే విధంగా అతి సామాన్య మైన ఎస్‌టి కుటుంబానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో పిఈటి టీచరుగా పనిచేస్తున్న గొట్టేటి మాదవి,చిన్న ఫోటో స్టూడియో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తాటికొండకు చెందిన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన నందిగం సురేష్‌ను పార్లమెంటుకు పంపిన వైనం బడుగు వర్గాలు జగన్‌కు జేజేలు పలుకాయి. అదే విధంగా పధ్రాన పార్టీలైన టిడిపి,ఇతర పార్టీలు కూడా బడుగు వర్గాలు చట్ట సభలకు వెళే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న యువత:**
రాజకీయాలలో వచ్చిని అవకాశాన్ని చేజారకుండా బడుగు వర్గఆలకు చెందిన యువత సద్వినియోగం చేసుకుంటుంది.2001 నుంచి ప్రారంభమైన బిసీల రాజకీయ ప్రాధాన్యను 2007లో కూడా సద్వినియోగం చేసుకున్నారు. అదే విధంగా 2013, 2021లోకూడా అదే జోరును కొనసాగించింది. అయితే ఇదంతా స్థానిక సమరంలోనే సాగింది. ఇక నుంచి చట్ట సభలలో తమ వాణిని వినిపించాలన్న లక్ష్యంతో బిసీ యువత పోటీ చేసేందుకు ఉవ్విళ్ళూరుతోంది. ఇప్పటికే అనేక అంశాలలో నాయకత్వ లక్షణాలను చూపిస్తున్న బీసి యువత ఇక చట్ట సభలకు ఎలా వెళ్ళాలన్న కోణంలో నిశితంగా గమనిస్తున్నట్లు తెలుస్తుంది.కాగా రానున్న 2024 ఎన్నికల్లో బీసీలకు దమాషా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపి సీట్లు ఇవ్వాలన్న డిమాండును పార్టీల ముందుకు తీసుకొచ్చే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

# బ్రతుకుకు భరోసా రావాలి

**గుంటూరు, మే 23( మనసులో మాట) :**
దివ్యాంగుల బ్రతుకుకు భరోసా రావాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ అన్నారు. ఉద్యోగులు, ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం ఎస్ఆర్ శంకరన్ సమావేశం మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి వారి ఆర్జీలను స్వీకరించారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని దివ్యాంగులు కోరగా ఒకసారి ఉపాధి పొందిన తరువాత మరల వెనుదిరిగి చూడరాదని అన్నారు. మొత్తం ఎంత మంది ఉన్నారు, వారి అర్హతలు, నైపుణ్యాలు, అనుభవాలను తెలియజేస్తూ మొత్తం సమాచారం అందించాలని సూచించారు. నైపుణ్యాలు అవసరమైతే ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి శాఖ ద్వారా శిక్షణ కల్పించుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, ఆ మేరకు అవకాశాలు కల్పించుటకు సహకరిస్తామని, దానిని వినియోగించుకోవాలని కోరారు. దివ్యాంగులను పేరు పేరునా పలకరించి వివరాలు తెలుసుకు



న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఉద్యోగులు, ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ ను ప్రతి నెల నాలుగవ శనివారం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇందులో అందిన అర్జీలు నాణ్యంగా పరిష్కరించుటకు కృషి చేస్తామని చెప్పారు. ప్రత్యేక గ్రీవెన్స్ ను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఈ గ్రీవెన్స్ లో అందిన ఆర్జీల పట్ల ప్రత్యేక దృష్టి సారించి, వారి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని వివరించారు. దివ్యాంగులు ఉపాధి కోసం కోరారని, స్వయం ఉపాధి కల్పించుటకు వివరాలు సమర్పించాలని కోరామన్నారు. మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా, పురుషులకు ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి కల్పించి స్వయంగా తమ కాళ్లపై నిలిచే విధంగా ప్రయత్నిస్తామని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉద్యోగులు, ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ ప్రాంగణంలో కూలర్లు, తాగు నీరు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఎస్.సి కార్పొరేషన్ ఇ.డి డి.దుర్గా భాయి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, ఆర్.టి.ఓ కె. శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## యువత మోడీని ఆదర్శంగా తీసుకుని

# దేశాభివృద్ధికి కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి గాను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు దేశంలోని ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఈ రోజ్ గార్ మేళాను ఉద్దేశించి వర్చువల్ గా మాట్లాడారు.కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న ఉద్యోగులను, దేశ యువతను, పౌరులను ఉద్దేశించి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడారు.ఈరోజు ఒక నాయకుడిగా మేము ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు మొదటిగా అడిగేది ఉద్యోగం కావాలని అంటున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇవ్వడం అనేది అనాదిగా జరుగుతున్న ప్రభుత్వ ప్రక్రియ. కానీ, ఏకంగా ప్రధాన మంత్రి నేరుగా ఈ ప్రక్రియను పరిశీలిస్తూ.. ఉద్యోగ ప్రక్రియను ఎప్పటికప్పుడు అభివృద్ధి పరుస్తూ, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల కల్పన రూపొందించడం అనేది అరుదైన అంశం అన్నారు.అలాంటి నాయకుడిని ప్రేరణగా తీసుకొని ప్రతి ఒక్క భారతీయుడు బాధ్యతతో అడుగులు వేస్తే భారతదేశం ఉన్నత దేశంగా ఎదగడానికి ఎంతో కాలం పట్టదన్నారు. భారతదేశంలో జాతీయ రహదారులన్నిటిని సమన్వయం చేశారు. రైల్వే స్టేషన్లు అన్నిటినీ అభివృద్ధి పరుస్తున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. నందివెలుగు ఆర్ఓబి 2013లో మంజూరు అయింది. ఆ నిర్మాణాన్ని ముందుకు తీసుకొచ్చి సమయంలో ప్రభుత్వ మారిన తర్వాత దాదాపు ఐదేళ్లపాటు ఆ నిర్మాణాన్ని మూలన పడేశారు.తిరిగి మేము వచ్చి ఫైళ్ళను కదిలించి, నిధులను సమీకరించి, తిరిగి ఆ నిర్మాణాన్ని చేపట్టేదాకా ఎవరూ పట్టించుకోలేదన్నారు. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం హయాంలో ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలకు కేవలం రూ. 800 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించారు.కానీ 2026 27 బడ్జెట్లో ఒక్క ఆంధ్ర ప్రదేశ్కు మాత్రమే పదివేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించడం ఎన్ డి ఏ, కూటమి ప్రభుత్వ అభివృద్ధి ప్రక్రియలకు నిదర్శనమని చెప్పవచ్చు.

**వ్యవస్థను మార్చాలంటే యువతకు మాత్రమే సాధ్యం**
వ్యవస్థలో ఇరుక్కుపోతారా! వ్యవస్థాను తెలివితేటలతో మార్చగలుగుతారా! అనేది మీపైనే ఆధారపడి ఉంది.* యువకులు భారతదేశానికి భారం కాకూడదు. సర్టిఫికెట్లు కంటే స్కిల్ ద్వారానే మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోగలుగుతారు. భారతదేశ ప్రజలందరూ కష్టపడి సంపాదించుకొని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుల ద్వారా టాక్స్ లు చెల్లించడం వల్లే ఇప్పుడు కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ప్రతి ఒక్కరికి జీతాలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వగలుగుతుంది ఈ దేశంలో 1.65 లక్షల పోస్ట్ ఆఫీస్ లో ఉన్నాయి. 4.50 లక్షల ఉద్యోగులు ఉన్నారు. 2016 నుంచి 2025 వరకు పోస్ట్ ఆఫీస్ కు భారత దేశంలో 200 వేల కోట్లు ఆదాయం. ఇప్పుడు ఆదాయాన్ని రూ. 2వేల కోట్లకు పెంచగలిగాము.ఎవరు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా.. పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా.. మీరు నమ్మిన సిద్ధాంతాన్ని, పనిని గౌరవంగా ముందుకు తీసుకెళ్లగలిగిన నాడే మీరు సక్సెస్ అవుతారు, తద్వారా భారతదేశం ముందుకు వెళ్లగలుగుతుంది.*ఉద్యోగులు మైండ్ సెట్ మార్చుకోవడం ద్వారా, తమ ఉన్నతిని తామే తీర్చి దిద్దుకునే అవకాశం మెరుగవుతుంది. ప్రభుత్వ ఉద్యోగం అందుకున్న వెంటనే శాఖలో ఉన్నటువంటి లోపాలను గుర్తించి, పరిష్కరించడం వంటి మెరుగైన సౌకర్యాలు కల్పించడం వంటి బాధ్యతలను తీసుకున్నప్పుడే ఉద్యోగగా మీరు ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారు.
నూతనంగా ఉద్యోగ బాధ్యతలను తీసుకుంటున్న ప్రతి ఒక్క ఉద్యోగికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.
కార్యక్రమం అనంతరం విధులలో చేరబోవు రైల్వే పోస్టల్ బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన ఉద్యోగులకు పెమ్మసాని గారు తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.*
ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం సుధేష్ణ సేన్ గారు, రైల్వే, పోస్టల్, బ్యాంకింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో ముమ్మరంగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్"

**నరసరావుపేట మే 23 (మనసులో మాట)::**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' మహాయజ్ఞంలో భాగంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. మే 22 నుండి జూన్ 20 వరకు నాలుగు వారాల పాటు సాగే ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా.. శనివారం నరసరావుపేట మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని సత్తనపల్లి రోడ్డు కోట సెంటర్ నుండి గుంటూరు రోడ్డు బైపాస్ వరకు విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ద్వారా నరసరావుపేట మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యంత స్వచ్ఛమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముందే, గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో ప్రతిరోజూ ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, ప్రస్తుత స్పెషల్ డ్రైవ్‌లోనూ నరసరావుపేటను ముందు వరుసలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ పారిశుధ్య డ్రైవ్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డుగా నిలిపేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా జియోట్యాగింగ్, డ్యాష్‌బోర్డ్ నివేదికలు, మైక్రో ప్లానింగ్ వంటి పారదర్శక వ్యవస్థలను అమలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి పరిసరాలను అపరిశుభ్రం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు వారాల కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. దీనిలో భాగంగా మొదటి వారంలో రెడ్, ఎల్లో, బ్లాక్ స్పాట్ల నిర్మూలన, ప్రధాన రహదారులు, జంక్షన్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ బృహత్తర కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, రెవిన్యూ సిబ్బంది, ఎంఆర్వో, ఆర్డీవోలతో పాటు ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం చేయాలి

**గుంటూరు, మే 23( మనసులో మాట) :**

అక్షరఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమంవిజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమంలో ఈ ఏడాది లక్ష్యం 77,501 గా ఉందని తెలిపారు. అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. 2026 27 సంవత్సరంలో ఉల్లాస్ అక్షర ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని అన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని వయోజనులను శత శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 25 లక్షల మందిని అక్షరాస్యులుగా చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వంద గంటల కరిక్యులం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఇందులో ఆడియో విజువల్ కంటెంట్, తరగతి గదులు, ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. తరగతులను సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతిరోజు స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించుటకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎప్పటిలాగానే ప్రాథమిక పాఠ్యాంశాలు, సాధన పత్రాలు పంపిణీ జరుగుతుందన్నారు. 48 రకాల డిజిటల్ వీడియోలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఫౌండేషన్ లెటర్స్ అండ్ న్యూమరసి కోర్స్ (ఎఫ్.ఎల్.ఎన్.సి) ను నైపుణ్యం పెంచడం లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందన్నారు. 2026 సంవత్సరంలో నిర్వహించిన ఎఫ్.ఎల్.ఎన్.సి పరీక్షకు జిల్లా నుండి 92,387 మంది హాజరు కాగా 92,235 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

# చేతిలో వెన్నముద్ద తోకనిపించే బాలకృష్ణుడి ఆలయం

- **ప్రపంచంలో ఇంకెక్కడా లేని అరుదైన విగ్రహం, మన తెలుగు నేల పైనే!**

**చిలకలూరిపేటమే23 మనసులో-మాట**

చేతిలో వెన్నముద్ద తో కనిపించే బాలకృష్ణుడి ఆలయం... ప్రపంచంలో ఇంకెక్కడా లేని అరుదైన విగ్రహం.. మన తెలుగు నేల పైనే ఉంది. పూర్తి వివరాలు తెలుసుకుందాం...
యడ్లపాడు మండలం చంఘీజ్ ఖాన్ పేట (కొండవీడు సమీపంలో) వెన్నముద్ద బాలకృష్ణుని ఆలయం ఉంది. విజయనగర చక్రవర్తుల కాలానికి చెందిన ఈ చారిత్రక దేవాలయంలో బాలకృష్ణుడు కుడి చేతిలో వెన్నముద్ద, ఎడమ చేతిలో వెన్న గిన్నెతో పాకుతున్నట్లు దర్శనమిస్తాడు. ఈ అరుదైన విగ్రహం సుమారు 350 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది.తెలుగు నేలపై వందల ఏళ్ల నాటి అరుదైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి పల్నాడు జిల్లాలో ఉంది. అదే చారిత్రిక కొండవీడు కోటకు సమీపంలో ఉండే నవనీత బాల కృష్ణ స్వామి ఆలయం.

**చేతిలో వెన్న ముద్దతో.. పాకుతూ కనిపించే బాలకృష్ణుడు**

కొండవీడు కోట కింద 'చెంగిజ్ ఖాన్ పేట 'అనే చిన్న గ్రామం ఉంది. దీనిని ఒకప్పుడు 'సింగనిసాని పేట ' అని పిలిచేవారట. ఇక్కడ ఉండే "నవనీత బాల కృష్ణ స్వామి ఆలయం " లో విగ్రహం చాలా అరుదైనది. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి కృష్ణుడి విగ్రహం లేదు. కుడి చేతిలో వెన్నెముద్దను బంతిలా పట్టుకుని ఎడమ చేతిలో వెన్న గిన్నె పట్టుకుని పాకుతూ వస్తున్నట్టు ఉండే ఈ విగ్రహం చాలా అందంగా ఉంటుంది. రెండున్నర అడుగుల ఎత్తు మూడు అడుగుల పొడవు ఉండే ఈ విగ్రహం తూర్పు ముఖంగా ఉంటుంది. వందల ఏళ్ల నాటి ఈ ఆలయం చూడడానికి చాలా సాధారణంగా ఉంటుంది. ఆలయంలోపలకి అడుగు పెట్టగానే ఆలయ వృక్షం భారీ జమ్మిచెట్టు చిన్న మండపం స్వాగతం పలుకుతాయి. ఆలయ మండపంలో నీలి రంగులో ఉన్న ఆంజనేయ స్వామిని దర్శించుకోవచ్చు. ఇక గుడిలోని బాల కృష్ణ స్వామి మెడలో పులిగోరు పతకం ఉండడం విశేషం.

**శ్రీ కృష్ణ దేవరాయలు తెచ్చిన విగ్రహం ఇది**

కొండవీటి కోటను జయించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు అక్కడ గుడి కట్టించి హంపి నుంచి తీసుకువచ్చిన బాల కృష్ణుడి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించారు. ఆ తర్వాత కొన్నేళ్లకు గోల్కొండ సుల్తానుల దాడి చేస్తారేమో అనే భయంతో బాలకృష్ణుడి విగ్రహంతో సహా ఇతర దేవతామూర్తులను భూమిలో పాతి పెట్టారు స్థానిక పూజారులు. 1712 నాటికి ఆ ప్రాంతం చిలకలూరిపేట జమీందారుల చేతిల్లోకి వెళ్ళింది. ఆ జమీందారుల్లో ఒకరైన మానూరి వెంకట హనుమంత రావు ఆలయాన్ని పునరుద్ధరించి విగ్రహాలు ప్రతిష్టించి నిర్వహణ కోసం భూములను దానం చేశారని స్థలపురాణం. ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరుగుతాయి. భారీగా భక్తులు తరలివస్తారు.





**ఈ ఆలయానికి ఎలా చేరుకోవాలి?**

గుంటూరు నుంచి నరసరావుపేట వెళ్లే దారిలో ఫిరంగిపురం వస్తుంది. అక్కడనుండి 10 కిలోమీటర్ల దూరంలో ఈ చెంగిజ్ ఖాన్ పేట ఉంటుంది. అలాగే చిలకలూరిపేట నుండి పిరంగిపురం వెళ్ళు బస్సులు సింగిస్కాన్ పేట మీదనే వెళుతాయి, అలాగే గుంటూరు నుండి చిలకలూరిపేట వైపు వెళ్ళు రహదారిలో బోయపాలెం వద్ద దిగి చెంగిస్కాన్ పేట వెళ్ళవచ్చు.ఈ గుడి తో పాటు కొండవీటి కోటను చూడడానికి ఒక రోజు సరిపోతుంది. ఒకటి రెండిటిని కలిపి ప్లాన్ చేసుకుంటే ఒక మంచి టూరిజం ట్రిప్ అవుతుంది. అయితే ఇక్కడ సౌకర్యాలు తక్కువ కాబట్టి నీరు ఆహారం వెంట తీసుకుని వెళ్లడం మంచిది.

# కార్మిక సోదరులారా.. దళారులను నమ్మకండి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- **చెమటోడ్చే కార్మిక లోకానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండ - ఎమ్మెల్యే చదలవాడ**
- **కొత్త జీవో నెం. 6 పథకాలపై కార్మికులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే**

**నరసరావుపేట మే 23 (మనసులో మాట)::**



రాష్ట్రంలో చెమటోడ్చి రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న కార్మిక సోదరుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ వద్ద రోజువారీ కూలీ పనుల కోసం వేచి ఉన్న భవన నిర్మాణ కార్మికులను ఆయన స్వయంగా కలుసుకుని ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై కార్మికులకు పూర్తి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు కార్డు కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్మికుల కష్టాలను వారి జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేసిందని కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా 2026 జీవో నెంబర్ 6 ప్రకారం ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో రిజిస్టర్ అయిన కార్మికులకు మార్చి 1, 2026 నుండి అమల్లోకి వచ్చిన పలు ముఖ్యమైన పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఇందులో భాగంగా మహిళా కార్మికురాలికి లేదా కార్మికుడి ఇద్దరు కుమార్తెల వివాహానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందించే వివాహ కానుక పథకం వర్తిస్తుందని, దీనికోసం రిజిస్టర్ అయిన ఏడాది తర్వాత ఆధార్ కార్డు ,వివాహ ధృవీకరణ పత్రం,బ్యాంక్ పాస్ పుస్తకం,గుర్తింపు కార్డు జిరాక్స్‌లు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే మహిళా కార్మికులకు లేదా కార్మికుని భార్యకు ప్రసూతి సమయంలో రూ.20,000 ఆర్థిక సహాయం లభిస్తుందని రిజిస్ట్రేషన్ అయిన ఏడాది తర్వాత వర్తించే ఈ పథకానికి ఆధార్,కాన్పు సర్టిఫికెట్, జనన ధృవీకరణ పత్రం,బ్యాంక్ పాస్‌బుక్ అవసరమని పేర్కొన్నారు. ఒకవేళ కార్మికుడు సహజ మరణం చెందితే ఆ కుటుంబానికి రూ. 60,000 ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని దీనికోసం మరణించిన వ్యక్తి,నామినీ ఆధార్ కార్డులు,ఈసేవా పోర్టల్ ద్వారా జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రం, నామినీ బ్యాంక్ పాస్‌బుక్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ జతచేయాలని వివరించారు.అర్హులైన ప్రతి భవన నిర్మాణ కార్మికుడు వెంటనే బోర్డులో నమోదు చేసుకుని ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.సంక్షేమ పథకాల రిజిస్ట్రేషన్ పేరుతో వచ్చే దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని పూర్తి వివరాల కోసం నేరుగా కార్మిక శాఖ కార్యాలయాన్ని లేదా ఈసేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ షేక్ సుభాని మరియు కూటమి పక్షాల ప్రతినిధులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## జూన్ 8, 9 తేదీలలో లిక్విడేషన్ సొసైటీల మహాజన సభ సమావేశాలు

- **రికార్డులతో హాజరుకావాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్/ లిక్విడేటర్ స్వర్ణ చినరామిరెడ్డి పిలుపు**

**నరసరావుపేట మే 23 (మనసులో మాట)::**

నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో సుప్తావస్థలో ఉన్న పలు ఉద్యోగుల పరపతేతర సహకార సంఘాల పరిసమాప్తి (లిక్విడేషన్) ప్రక్రియలో భాగంగా వచ్చే నెల జూన్ 8, 9 తేదీల్లో ప్రత్యేక మహాజన సభ సమావేశాలు నిర్వహించనున్నట్లు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరియు లిక్విడేటర్ స్వర్ణ చినరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వ్యాపారాలు నిర్వహించి, ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు సాగించకుండా నిలిచిపోయిన సంఘాలను లిక్విడేషన్ చేయాల్సిందిగా డివిజనల్ కోఆపరేటివ్ అధికారి నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సదరు సొసైటీలకు సంబంధించిన ఆస్తులు, నిరర్థక ఆస్తులు, అప్పులు, బ్యాంకు నిల్వలు, అలాగే సభ్యుల స్థాయిలో ఉన్న రుణాల పూర్తి వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. అందు కోసమే లింగంగుంట్ల కాలనీలోని సబ్ డివిజన్ కోఆపరేటివ్ కార్యాలయంలో ఈ మహాజన సభలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డివిజనల్ అధికారి ఉత్తర్వుల ప్రకారం, నరసరావుపేట పి.డ బ్ల్యూ.డి.వర్క్‌షాప్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ,నరసరావుపేట రెవిన్యూ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, నరసరావుపేట పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, నరసరావుపేట ఎన్.ఎస్.సి. వర్క్స్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, అనిమల్ హస్బెండరీ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, నరసరావుపేట ఎ.పి.ఎస్.ఇ.బి. ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, నరసరావుపేట ఒరియంటల్ హైస్కూల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మరియు నరసరావుపేట మునిసిపల్ మీనియల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సంఘాలు లిక్విడేషన్ జాబితాలో ఉన్నాయని లిక్విడేటర్ తెలిపారు. పైన పేర్కొన్న ఎనిమిది సహకార సంఘాల సాధారణ సభ్యులు, మాజీ పాలకవర్గ సభ్యులు, సంఘాల ఉద్యోగులు తమ వద్ద ఉన్న సమాచారం, అధికారిక రికార్డులు, రుణ పుస్తకాలు మరియు ఇతర పత్రాలతో షెడ్యూల్ ప్రకారం నిర్ణయించిన తేదీల్లో మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి స్పష్టం చేశారు. సకాలంలో రికార్డులు సమర్పించి లిక్విడేషన్ ప్రక్రియ వేగంగా ముగిసేందుకు సహకరించాలని ఆయన కోరారు.

# ఎండ తీవ్రత నుండి ఉపశమనం

- **చిలకలూరిపేటలో గ్రీన్ షెడ్ నెట్ల ఏర్పాటు..**

**చిలకలూరిపేటమే 23 మనసులో మాట**

పట్టణంలో ఎండ తీవ్రత, వడగాలుల నుండి ప్రజలను, వాహనదారులను రక్షించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గ్రీన్ షెడ్ నెట్లను (టెంట్లను) ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీం ఒక ప్రకటనలో తెలిపారు.



చిలకలూరిపేటలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన ఎన్ ఆర్ టి సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, మరియు మూడు అన్న క్యాంటీన్ల వద్ద ఈ గ్రీన్ మ్యాట్లను అమర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

**ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఊరట.**

ప్రధాన కోడలిలో ట్రాఫిక్ నియంత్రణ సమయంలో ఎండ వేడిమిని భరించలేక వాహనదారులు ఇబ్బంది పడుతుంటారని,ఈ షెడ్ల వల్ల వారు కాస్త ప్రశాంతంగా నీడన ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడానికి ఆస్కారం ఉంటుందని డీఈ వివరించారు.

**పట్టణ ప్రజలు హర్షం.**

మున్సిపల్ యంత్రాంగం తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు .ఈ టెంట్లు కేవలం ద్విచక్ర వాహన దారులకే కాకుండా,కనుచూపు మేర నీడ లేక అల్లాడిపోయే కాలినడక ప్రయాణికులకు, సామాన్య ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ అధికారుల చొరవను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## జానీ భాష లైన్ ఇన్స్పెక్టర్ కు ఉత్తమ రెవిన్యూ వసూళ్ల అవార్డు

**కారంపూడి, మే 23, ( పలనాడు జిల్లా ) :-**

విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్లో మాచర్ల టౌన్ లైన్స్పెక్టర్ గా విధులను నిర్వహిస్తూ, తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కన్వీనర్ గా, పల్నాడు జిల్లాలోని విద్యుత్ కార్మిక సంఘం సభ్యుల సమస్యలు తీరుస్తూ, లైన్ ఇన్స్పెక్టర్ గా తన విధులను నిర్వహిస్తూ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో మాచర్ల డివిజన్ రెవిన్యూ ప్రథమ స్థానంలో నిలబడేందుకు మాచర్ల డివిజన్ సిబ్బంది చేసిన కృషితో పాటు తాను కృషి చేసిన, తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ జానీ భాష ఉత్తమ రెవెన్యూ వసూళ్ల అవార్డును అందుకున్న సందర్భంగా జానీ భాషకు ఆ యూనియన్ నాయకులు, గ్రె. పాండు రంగారావు మాచర్ల డివిజన్ తెలుగు నాడి విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షులు, ఆ సంఘ కోశాధికారి జలగం శ్రీనివాసరావు, మందలపు నరహరి, పి. మున్నయ్య ,1104 యూనియన్ రాష్ట్ర నాయకులు బి. రామేశ్వర నాయక్ శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపార్ట్మెంట్లో తన విధులను తాను నిర్వహిస్తూ, అధికారులు మనలను పొందుతూ, విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, మాచర్లలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకుని వినియోగదారుల మనలను పొందుతున్న జానీ భాషా లైన్ ఇన్స్పెక్టర్, తన తోటి సహోద్యోగులతోనూ కలివిడిగా ఉంటూ, జిల్లా స్థాయిలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం సభ్యుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి వారి సమస్యలను కూడా పరిష్కరిస్తూ, అందరి మన్నలను పొందుతున్న జానీ భాష ఇక ముందు ముందు కూడా ఎన్నో అవార్డులు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాము అన్నారు. జానీ బాషా కు శుభాభినందనలు తెలిపిన వారిలో హనుమంతు నాయక్ లైన్మెన్, పఠాన్ సుభాని అసిస్టెంట్ లైన్మెన్, రామారావు లైన్మెన్, బొలినిడి పవిత్ర ఎల్ డి సి, బి.షాలేం అసిస్టెంట్ లైన్మెన్, కె. హనుమంతరావు ఫోర్ మెన్, కొండలరావు లైన్మెన్ ఇంకా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు ఉన్నారు.




## పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి సిఐటియు

**పెదకాకాని, మే 24. మనసులో మాట:**

పెదకాకాని శనివారం కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు

ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి అధ్యక్షతన జరిగిన సభలో ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 5 రాష్ట్రాలలో ఎన్నికలు అయిన వెంటనే పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచారని ఇప్పటికే అనేకసార్లు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరగడం వాహనాలకు ఫిట్నెస్ చార్జీలు రోడ్డు టాక్స్ టోల్ గేట్లు పెరగడం స్పేర్ పార్ట్స్ పై జీఎస్టి విధించడం అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు పెంచడం దీనికి తోడు బాడుగలు లేక ప్రతి నెల ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక మొత్తం రావాణా రంగం సంక్షోభం లో కొట్టు మిట్టాడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా లీటర్ డీజిల్ పై 3. రూపాయల 14 పైసలు పెంచడం వలన రావాణా రంగం డ్రైవర్ల ఉపాధి దెబ్బతినడంతో పాటు ప్రజల పైన మరింత భారం పడి అన్ని రకాల నిత్యవసర సరుకులు ధాన్యం పప్పులు ఉప్పులు రావాణా చార్జీలు పెరగడం ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయని అన్నారు పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని ఆటో కొనుగోళ్లకు సబ్సిడీతో వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని జీవో నెంబర్ 21 రద్దు చేయాలని అన్ని రకాల ఫీజులు ఎనాల్టీలు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు



## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పారిశ్రామికవేత్త కందిరవిశంకర్

- **చదలవాడలో హోటల్ రాడిసన్.. రవి ప్రియ ఫైవ్ స్టార్ హోటల్ భారీ ప్రాజెక్ట్**
- **కంది రవిశంకర్ను అభినందించిన ముఖ్యమంత్రి**
- **స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించండి**
- **ప్రకాశంలో భారీ ప్రాజెక్టులకు సహకరించండి.**
- **కంది రవిశంకర్కు ముఖ్యమంత్రి సూచన**

**ఒంగోలు మే 23 (మనసులో మాట)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన రవి శంకర్ గ్రూప్ అధినేత, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ , ఈ సందర్భంగా చదలవాడ గ్రామంలో హోటల్ రాడిసన్ రవి ప్రియ ఫైవ్ స్టార్ హోటల్ ప్రాజెక్ట్ ను ప్రారంభించబోతున్న కంది రవిశంకర్ ని అభినందించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఇలానే అనేక ప్రాజెక్టులు చేపట్టి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు, ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధికి కూడా మీ యొక్క సూచనలు, ఇలాంటి ప్రాజెక్టులు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు, తప్పకుండా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో నా వంతు కృషి చేస్తానని రవిశంకర్ నారా చంద్రబాబు నాయుడుకి తెలియజేశారు. ప్రకాశం జిల్లాలో భారీ ప్రాజెక్టులకు సహకరించండి. ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.





# డిపిఎమ్ఓ అకస్మిక తనిఖీ

**పెదకాకాని, మే 24. మనసులో మాట:**

పెదకాకానిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఉదయం డి పి ఎం ఓ డాక్టర్ కే సుజాత ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బందితో మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని నివారించుటకు హెచ్ పి వి వ్యాక్సిన్ ను అర్హులైన బాలికల అందరికీ అందించాలని తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని. వడగాలుల వల్ల వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఎల్లప్పుడూ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందించటానికి అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారులు, ఏ ఎన్ ఎం లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# గడ్డివాము తగలబెట్టిన టీడీపీ నాయకుడిని వెంటనే అరెస్ట్ చేయాలి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి డిమాండ్

**నరసరావుపేట మే 23 (మనసులో మాట)::**

నరసరావుపేట నియోజకవర్గం, రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామంలో పేద రైతు గడ్డివామును తగలబెట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దావులూరి మరియబాబును తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తురుమెళ్ళ గ్రామానికి చెందిన పాలెపోగు జయరావు, జయమ్మ దంపతులకు చెందిన సుమారు పది ఎకరాల వరిగడ్డి వామును (విలువ సుమారు లక్ష రూపాయలు)నిన్న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మరియబాబు దుర్మార్గంగా తగలబెట్టాడు.సగం వాము తగలబడే వరకు అక్కడే ఉండి వికృతానందం పొందడమే కాకుండా వారించిన ఒక గ్రామస్తురాలిని సైతం నిన్ను కూడా గడ్డివాములో వేసి తగలబెడతా అంటూ ప్రాణభీతి కలిగించేలా బెదిరించడం అత్యంత అమానుషం. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నోరులేని పశువులు తినే మేతను రాజకీయ కక్షలతో ఈ రకంగా తగలబెట్టడం దుర్మార్గమైన చర్య,రానున్నది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.మా పార్టీ కార్యకర్తల జోలికి వస్తే భవిష్యత్తులో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పోలీసులు తక్షణమే స్పందించి నిందితుడు మరియబాబును అరెస్ట్ చేయాలి. లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని అన్నారు. గడ్డివాము తగలబడటంతో తీవ్ర నష్టానికి గురైన పాలెపోగు జయరావు,జయమ్మ దంపతులను డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి వారికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు,తురుమెళ్ళ గ్రామ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







# సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లో రెవెన్యూ వసూళ్లలో ప్రథమ స్థానంలో మాచర్ల డివిజన్..... ఈ ఈ నూతలపాటి సింగయ్య

- **ఉమ్మడి 3 జిల్లాలోని 21 డివిజన్లో రెవెన్యూ వసూళ్లలో రెండవసారి ప్రథమ స్థానంలో నిలిచిన మాచర్ల డివిజన్.**

**కారంపూడి, మే 23, ( పలనాడు జిల్లా ) మనసులో మాట :-**

ఆంధ్రప్రదేశ్లోని విద్యుత్ శాఖలో ఉన్న మూడు డిస్కామ్స్ లో సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధి లో పని చేస్తున్న 21 డివిజన్లలో రెవెన్యూ వసూళ్లలో 102% వసూళ్లతో ప్రథమ స్థానంలో మాచర్ల డివిజన్, రెండవ స్థానంలో 100.5వసూళ్లతో ఉయ్యూరు డివిజన్ నిలువగా,మాచర్ల డివిజన్ని రెండవసారి ప్రథమ స్థానంలో నిలిపి, సి పి డి సి ఎల్ పరిధిలో అవార్డులను కైవసం చేసుకునేలా పల్నాడు సర్కిల్ ను, మాచర్ల డివిజన్ ను నడిపిన రథసారథులు పల్నాడు జిల్లా సూపర్నెంట్ ఇంజనీర్ విజయ్ కుమార్, మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగయ్యలకు విద్యుత్ సిబ్బంది అభినందనలు తెలియజేస్తున్నారు.అదేవిధంగా ఈ గొప్ప కార్యక్రమంలో సుశిక్షితులైె విద్యుత్ సిబ్బంది బిల్లుల వసూళ్లలో కష్టనష్టాలకు ఓర్చుకొని, డిస్కంలో మాచర్ల డివిజన్ ను ప్రథమ స్థానంలో నిలపటంలో కృషిచేసిన సిబ్బంది అందరికీ శుభాభినందనలు తెలియజేస్తూ, డివిజన్లో ఉన్న సిబ్బందికి అందరి తరుపున ఆయా సెక్షన్లలోని అసిస్టెంట్ ఇంజనీర్లను, సిబ్బంది తరపున లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లను కొంతమందికి జిల్లా సూపర్నెంట్ ఇంజనీర్ విజయ్ కుమార్ షీల్డ్, ప్రశంసా పత్రాన్ని ఇచ్చి సన్మానించారని మాచర్ల డివిజన్ ఈఈ సింగయ్య తెలిపారు. ప్రతి సెక్షన్ లోని ఆయా సిబ్బందిని సన్మానించడం ద్వారా విద్యుత్ రెవెన్యూ వసూళ్ల నిర్వహణలో పాల్గొనిన ప్రతి ఒక్కరిని సన్మానించినట్లుగానే భావించవలసిందిగా సిబ్బందిని ఈఈ సింగయ్య కోరారు. ఇదేవిధంగా సిబ్బంది ఐకమత్యంగా ఉండి విద్యుత్ అంతరాయాలు లేకుండా, విద్యుత్ వినియోగదారులకు త్వరితగతిన సేవలందిస్తూ విద్యుత్ వినియోగదారుల మన్ననలను పొందాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ ఎండాకాలంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున బ్రేక్డౌన్స్కు అటెండ్ అయ్యే సిబ్బంది త్రాగేందుకు మంచినీటిని వెంట ఉంచుకోవాలని, ఎండ, వడగాలులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇకముందు కూడా డివిజన్లోని ప్రతి ఒక్కరూ ఇదే రీతిలో తమ విధులను నిర్వర్తించి, మాచర్ల డివిజన్ ను ఇంకా శిఖరాలకు తీసుకువెళ్లాలని కోరారు.

# కరెంటు లేమితో అల్లాడిపోతున్న కారంపూడి మండల ప్రజలు

**కారంపూడి, మే 23, ( పలనాడు జిల్లా ) మనసులో మాట :-**

11 కెవి ఆపై హై టెన్షన్ లైన్లకు మరమ్మతులకు వచ్చినప్పుడు సిబ్బంది అందరూ వెళ్లాలన్న రూల్ను కూడా అధికమించి, తమపై అధికారుల ఆదేశాలలను లెక్కచేయక తమ గృహాలలో పడుకుంటున్న విద్యుత్ సిబ్బంది పై ఉన్నతాధికారులైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం కారంపూడి పట్టణం మరియు ప్రక్క గ్రామాలకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతూ ఆయా గ్రామాల సిబ్బంది ఇద్దరు మరియు కారంపూడి మండల విద్యుత్ అధికారి ఎండలను సైతం లెక్క చేయక,లైన్లలో తిరుగుతుంటే, గురువారం అవార్డులు అందుకున్న కొంతమంది సిబ్బంది మాత్రం తమకేమీ పట్టదని ఆ యా గ్రామాల లైన్లోకి మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజల మండిపడుతున్నారు. అసలు విద్యుత్ శాఖలో 11 కెవి ఆపై హై టెన్షన్ లైన్ లకు మరమ్మత్తులు వచ్చిన, మరి ఏ




ఇతర లోపాలు వచ్చిన ఆయా సెక్షన్లలోని సిబ్బంది మొత్తం ఆయా లైన్లో కచ్చితంగా పనిచేయవలసిన అవసరం ఉందన్న ఆదేశాలు ఉన్నప్పటికీ, కారంపూడి మండల సిబ్బంది మాత్రం వాటన్నిటికీ మినహాయింపు ఉన్నట్లుగా ఉంటుందని మండల ప్రజలు అంటున్నారు. ఎండల వేడిమి వల్ల కానీ గాలులు ఎక్కువగా వీచడం వలన గాని 11 కెవి, 33 కెవి లైన్ లలో అంతరాయం ఏర్పడినప్పుడు దానిని సరి చేయటం ఆయా సెక్షన్ లో ఉన్న సిబ్బంది అందరి బాధ్యత అని వారు గుర్తించకుండా, తమ తక్షణ పై అధికారి అయిన అసిస్టెంట్ ఇంజనీర్ ఆదేశాలని కూడా లెక్క చేయక, కరెంటు బాధలను ప్రజలకు చూపిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండల అధికారులు ఇక్కడ ఉన్న సిబ్బందికి భయపడి వారే పనిచేసుకునే పరిస్థితి కారంపూడి మండలంలో నెలకొని ఉందని విమర్శిస్తున్నారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందిని అధికారులు ఏమైనా మందలిస్తే వెంటనే వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆ అధికారికి బెదిరింపులు ఇప్పిస్తున్నారు. అటువంటి వారిపై ఉన్నతాధికారులు సైతం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి కారంపూడి మండలంలో నెలకొని ఉందని విమర్శిస్తున్నారు. ఉదాహరణకు శుక్రవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు కేవలం రెండు గంటల లోపు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేశారంటే మండలంలో విద్యుత్ సిబ్బందిలో ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుందని విమర్శిస్తున్నారు. సిబ్బంది చేత పనిచేయించవలసిన మండల విద్యుత్ అధికారి మండుటెండలలో తిరుగుతూ కష్టపడుతుంటే, కొంతమంది సిబ్బంది మాత్రం తమకు ఇవేమి పట్టదన్నట్లు గా తమ ఇండ్లలో పడుకున్నారని ఘాటుగా కారంపూడి పట్టణ మరియు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సరిగా పనిచేసే సిబ్బందిని కారంపూడి మండలంలో వేసి, ఇక్కడ పాతుకుపోయిన సిబ్బందిని మార్చి మాకు కరెంట్ కష్టాలు తొలగించవలసిందిగా మండల ప్రజలు విద్యుత్ ఉన్నతాధికారులకు మనవి చేసుకుంటున్నామంటున్నారు.



# ముువ్వ ఈశ్వరమ్మకు నివాళు-లర్పించిన డాక్టర్ భార్గవరెడ్డి

**ముప్పాళ్ళ,మే 23 (మనసులో మాట):** ముప్పాళ్ళ మండలం చాగంటి వారి పాలెం గ్రామంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ముువ్వ రాజారావు మాతృమూర్తి ఈశ్వరమ్మ స్వర్గస్తులైనారు.

సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి చాగంటి వారి పాలెం గ్రామంలో ఈశ్వరమ్మ నివాసానికి వెళ్లి వారి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారూరి పద్మావతి రామలింగా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఇందూరి నరసింహారెడ్డి,జిల్లా ప్రధాన కార్య దర్శి రెండెద్దుల వెంకటేశ్వర్ రెడ్డి, వనమాల బ్రహ్మారెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర లో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్

- మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు

**తెనాలి మే23(మనసులో మాట)**

రాష్ట్ర ప్రభుత్వం, స్వర్ణాంధ్ర స్వచ్చాంద్ర సాధనలో భాగంగా ఏర్పాటుచేసిన 4 వారాల ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు పట్టణంలోని 23 వార్డు పరిమిరోడ్డులో అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు తో కలిసి ప్రారంభించారు. అందులో భాగంగా రోడ్డు మొత్తం శుభ్రంగా ఊడిపించి రోడ్డు మార్జిన్ల్ లో ఉన్న చెత్త మొక్కలు ఇతర వ్యర్ధాలను పూర్తిగా తొలగింప చేశారు.ఊడ్చిన చెత్త, ఇతర వ్యర్ధాలు ట్రాక్టర్ ద్వారా తరలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ పై అవగాహన కల్పించేందుకు శానిటరీ సెక్రటరీలు నగర ధీపికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ రామా అప్పలనాయుడు



మాట్లాడుతూ నగరాలను , పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతొ నాలుగు వారాల ప్రత్యేక పారిశుధ్య కార్యాచరణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ నెల 23వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు,ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మొదటి వారం రోజుల్లో నగరంలోని రెడ్ స్పాట్లు (ఎక్కువగా చెత్త పేరుకు పోయే ప్రాంతాలు)ఎల్లో స్పాట్లును ప్రత్యేకంగా గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో శుభ్రం చేయించి,ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చడం జరుగుతుందని తెలిపారు.రెండవ వారంలో పట్టణంలోని ప్రధాన కాలువలు ఉప కాలువల్లో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించే పనులు చేపడతామని అన్నారు.మూడవ వారంలో నివాస ప్రాంతాలు,వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి,అక్కడ పేరుకుపోయే చెత్తను పూర్తి స్థాయిలో తొలగించి పరిసరాల పరిశుభ్రతను కాపాడుతామనీ చెప్పారు.నాల్గవ వారంలో నగరంలోని బహిరంగ మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ముఖ్యమైన సామూహిక ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు.తెనాలి పట్టణ ప్రజల ఆరోగ్యం, పట్టణ సుందరీకరణే ధ్యేయంగా ఈ ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహిస్తున్నామని, ప్రతీ రోజు ఉదయం మధ్యాహ్నం ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా ప్రత్యేక బృందాలను కేటాయించామన్నారు. పట్టణ ప్రజలు కూడా తమ ఇళ్లను వ్యాపార సంస్థలను శుభ్రంగా ఉంచుకుంటూ చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా పురపాలక సంఘు సిబ్బందికి అందించి ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.సానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్ సానిటరీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.






# పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు

- ప్రతి పౌరుడు బాధ్యత
- ఆపరేషన్ క్లీన్ స్వీట్ కార్యక్రమంలో ప్రజల భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ రాజాబాబు పిలుపు

**ఒంగోలు మే 23 (మనసులో మాట)**

పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని, "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యం" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మున్సిపాలిటీ ఆపరేషన్ క్లీన్ స్విప్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, సంతనూతలపాడు శాసన సభ్యులు బి ఎన్ విజయకుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి నెల్లూరు బస్టాండ్ వరకు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సంతనూతలపాడు శాసనసభ్యులు స్వయంగా పాల్గొని చీపుర పట్టి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరు బస్టాండ్ వద్ద తాటి ముంజలు అమ్ముకునే వారితో, తోపుడు బండి పై రాగి జావా అమ్ముకునే వారితో, ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ తరపున "ఆపరేషన్ క్లీన్ స్వీప్" అనే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఒంగోలు నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ రోజు ప్రారంభిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని మే 23వ తేదీ నుండి నాలుగు వారాలపాటు ఒక క్రమపద్ధతిలో అమలు చేయబడుతుందని, మొదటి వారంలో నగరంలోని చెత్త ఎక్కువగా పేరుకుపోయే రెడ్ స్పాట్లు (ఎక్కువగా చెత్త పేరుకుపోయే ప్రాంతాలు) మరియు యెల్లో స్పాట్లు (పాక్షికంగా చెత్త పేరుకుపోయే ప్రాంతాలు) పూర్తిగా తొలగించడంపై దృష్టి సారించడం, రెండవ వారంలో కాలువలు మరియు డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరిచి, నీటి నిల్వలు మరియు వరద సమస్యలను నివారించడానికి చర్యలు తీసుకోవడం, మూడవ వారంలో నివాస మరియు వాణిజ్య ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడం, నాల్గవ వారంలో పబ్లిక్ టాయిలెట్స్, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఇతర ప్రజా ప్రదేశాలను శుభ్రపరచడం ద్వారా హైజీన్ ప్రమాణాలను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మున్సిపల్ సిబ్బంది కృషితో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరం. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, పారిశుధ్య కార్మికులకు అందించాలి. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఈ సందర్భంగా నగర ప్రజలకు సూచించారు. అన్నీ వర్గాల ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తేనే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం విజయవంతమవుతుందని, ఇది కేవలం నాలుగు వారాల కార్యక్రమం మాత్రమే కాదని, నిరంతరం కొనసాగించి శాశ్వత పరిశుభ్రత సంస్కృతిని ఏర్పరచుకోవాలన్నారు. ఒంగోలు నగరాన్ని ఒక ఆదర్శ పరిశుద్ధమైన నగరంగా మార్చడంలో చేపట్టే పారిశుధ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్నీ నగరాలు, పట్టణాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ ఆపరేషన్ క్లీన్ స్విప్ కార్యక్రమాన్ని ఈ రోజు నుండి 4 వారాల పాటు జరుపుకోవడం జరుగుచున్నదని, అందులో భాగంగా ఈ రోజు ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఒక నగరం అభివృద్ధి చెందినదని చెప్పాలంటే, ముందుగా అది పరిశుభ్రంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య సమస్యలు కూడా రావని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రభుత్వం చేపట్టే పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమీషనర్ శ్రీ వెంకట క్రిష్ణయ్య, ఒంగోలు కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## చీమకుర్తి టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వర హార్డ్‌వేర్ షాప్‌లో జరిగిన దొంగతనం కేసులో

# ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు

- **కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని అభినందిచిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**
- **రూ.37 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం**



**ఒంగోలు మే 23( మనసులో మాట)**

ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర హార్డ్వేర్ షాప్ లో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు.

**స్వాధీనం చేసుకున్న బంగారపు వస్తువులు:**

1) బంగారుబ్రాస్లేట్ 1 5 సవరలు (40. గ్రాములు)
2) బంగారుసాదాహారం మరియు ఒకజత సాదాకమ్మలు 7 సవర్లు(56 గ్రాములు)
3) రాళ్ళతో పొదిగిన హారంమరియుఒకజతరాళ్లకమ్మలు 7 సవర్లు(55 గ్రాములు)
4) బంగారుసాదాచైను 1, 5సవర్లు, (40 గ్రాములు)
5) బంగారునల్లపూసలుదండ 1, 1 ½ సవర్లు, (12 గ్రాములు)
6) బంగారు ఉంగరాలు 4 (సాయిబాబా, వెంకటేశ్వరస్వామి, ఎల్ఐసి, పచ్చఉంగరాలు 30 గ్రాములు)
7) బంగారుబేబీఉంగరాలు 2, (1 గ్రాము)
8) బంగారుమహాలక్ష్మిబిళ్ళలు 9, (9 గ్రాములు)
9) బంగారుచెవిచుట్టుకమ్మలు, 1 జత 1సవర (8 గ్రాములు)
10) బంగారుకాశికాయలదండ 1, 1సవర (10 గ్రాములు)
11) బంగారుఫాన్సీచైన్ 1, 1 ½ సవర (12 గ్రాములు)

మొత్తంబంగారం 34 సవర్లు ( 273 గ్రాములు)

**స్వాదీనం చేసుకున్న వెండి వస్తువులు:**

1) వెండిపళ్ళాలు 2, (660 గ్రాములు )
2) వెండిప్లేట్ 1 ( 75గ్రాములు )
3) వెండిగ్లాసులు 5 ( 350గ్రాములు)
4) వెండిచెంబు ( 200గ్రాములు)
5) వెండిగిన్నెలు 16 ( 290గ్రాములు)
6) వెండిచిన్నగ్లాసులు 2 ( 70గ్రాములు)
7) వెండిపూజాసామగ్రి( 200గ్రాములు)

మొత్తంవెండి 1 కేజీ 845 గ్రాములు

**స్వాదీనం చేసుకున్న నగదు:రూ.5,95000/-.**

మొత్తం 34 సవరలు బంగారం, సుమారు 2 కేజీ ల వెండి మరియు నగదు రూ.5,95,000/ మొత్తం విలువ సుమారు రూ.37,00,000/.

ఫిర్యాది వివరములు:అద్దేపల్లి నగేష్ బాబు తండ్రి (లేట్) రత్తయ్య, వయస్సు 46 సంవత్సరాలు, కొత్తపేట బజార్, చీమకుర్తి పట్టణం మరియు మండలం.

కేసు వివరములు: ఫిర్యాది చీమకుర్తి టౌన్‌లోని కొత్తపేటలో నివాసం ఉంటూ, సుమారు 1½ సంవత్సరం క్రితం చీమకుర్తి టౌన్ మెయిన్ రోడ్డులోని ఇసుకవాగు సెంటర్ వద్ద శ్రీ వెంకటేశ్వర హార్డ్‌వేర్ షాప్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 12వ తేదీ ఉదయం సుమారు 8 గంటలకు షాప్ వద్దకు వెళ్ళి చూడగా, రెండవ గదికి ముందు ఉన్న చెక్క తలుపుకు బిగించి ఉన్న తాళం వేసే ఇనుప గడియను లేపి ఉన్నట్లు గమనించాడు. దీంతో అనుమానం వచ్చి రెండవ గదిలోకి వెళ్లి చూడగా, రెండు అలమారాల్లో ఉన్న బంగారం, వెండి, నగదును గుర్తు తెలియని దొంగలు దొంగిలించి వెళ్లిపోయినట్లు గుర్తించి, ఫిర్యాది చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినాడు.

ముద్దాయిల వివరములు: 1) మిరపల్లి ప్రసాద్ తండ్రి గురవయ్య, వయస్సు 22 సంవత్సరాలు, సీతారామపురం గ్రామం మరియు మండలం, నెల్లూరు జిల్లా ప్రస్తుతం పామూరు పట్టణం.
2) కుంభా సాంబయ్య తండ్రి రాములు, వయస్సు 40 సంవత్సరాలు, కులం ఎరుకుల, పెద్ద పలకలూరుగ్రామం, గుంటూరు జిల్లా .

కేసు ఛేధించిన తీరు: నేరస్థలంలో ఒంగోలు క్లూస్ టీం వారు సేకరించిన సాంకేతిక ఆధారాల మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, నేరస్థలం మరియు పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానం మరియు ఇతర ఆధారాలను ఉపయోగించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేయగా. నేరస్థలంలో సేకరించిన ఆధారాలు ఆధారంగా నెల్లూరు జిల్లా, సీతారామపురం గ్రామానికి చెందిన మిరపల్లి ప్రసాద్ @ గురవయ్యను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించారు.

ముద్దాయి ప్రసాద్ నెల్లూరు జిల్లాలోని సీతారామపురం, ప్రకాశం జిల్లాలోని టంగుటూరు, కందుకూరు టౌన్, పొదిలి, కనిగిరి మరియు శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదైన 13 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కావున ముద్దాయి కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టి, ముద్దాయిల సమాచారం సేకరించారు. శుక్రవారం కనిగిరి మండలంలోని నందనమారెళ్ల గ్రామ శివాలయం వద్ద పామూరు వైపు నుంచి స్కూటీపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పామూరులోని పి డి సి సి బ్యాంకు మరియు దుత్తలూరులోని ఎస్ బి ఐ బ్యాంకుల్లో ముద్దాయి ప్రసాద్ డిపాజిట్ చేసిన రూ.6,00,000/ నగదులో రూ.5,000/ ఖర్చు చేయగా, మిగిలిన రూ.5,95,000/లను ప్రసాద్‌తో విత్‌డ్రా చేయించి, మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. సదరు ముద్దాయి ప్రసాద్ భవనాలపైకి ఎక్కి, రూఫ్‌టాప్‌ల ద్వారా షాపులు మరియు ఇండ్లలోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతుంటాడు.ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు స్వీయ పర్యవేక్షణలో, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 1) చీమకుర్తి సీఐ ప్రసాద్, 2) చీమకుర్తి ఎస్సై సంపత్ కుమార్, 3) మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య, 4) కొత్తపట్నం ఎస్సై సుధాకర్, 5) ఒంగోలు తాలూకా ఎస్సై సుదర్శన్, 6)సంతనూతలపాడు ఎస్సై అజయ బాబు మరియు వారి సిబ్బంది బృందాలుగా ఏర్పడి, కేసును ఛేధించటం జరిగింది. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు,చీమకుర్తి సీఐ డి. ప్రసాద్, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎస్. రవీంద్రరెడ్డి, సబ్ డివిజన్ ఎస్సైలు ఎల్. సంపత్‌కుమార్, జి. వెంకట సూర్య, వి. అజయ్‌బాబు, వి. సుధాకర్, ఎం. సుదర్శన్, చీమకుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది వి. శ్రీనివాసులు, ఏఎస్ఐ.1776, బి. రంగయ్య, హెచ్‌సీ.1003, ఎన్. వి. రాము, పీసీ.1308, కె. అనిల్, పీసీ.2644, ఎ.వి. నాయుడు, పీసీ.2491, ఒంగోలు వన్‌టౌన్ జి. విజయ్, పీసీ.563, ఎం. అనిల్, పీసీ/2662, కొత్తపట్నం పియస్ ఎస్‌కే. మౌలాలి, పీసీ. 2640, మద్దిపాడు పియస్ జె. రమేష్, పీసీ.3525 లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డ్ అందచేశారు.

# ఎండ తీవ్రతపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- **విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జివి**

**వినుకొండ, మే23,(మనసులో మాట)**

జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, కార్మికులు , దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎండ ప్రభావానికి గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, అలా వచ్చేటప్పుడు తగినంత తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, అధిక దాహం, తల నొప్పి, వాంతులు, అలసట వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్య కేంద్రాలను సంప్రదించాలని దీనిపై గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు, ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు, బస్ స్టాండ్లలో తాత్కాలిక పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు, వేసవిలో కరెంటు కోతలు, లో వోల్టేజీ లేకుండా నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలని,విద్యుత్, మున్సిపల్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేసి అంగన్‌వాడీలు, పాఠశాలలు, బస్టాండ్లలో తాగునీటి కొరత




రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు, వ్యవసాయ, ఉద్యానవన పంటలకు, మూగజీవాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని, పరిశ్రమల్లో రసాయనిక పదార్థాల దగ్గర పొలాల్లో వ్యర్థాలను కాల్చేటప్పుడు అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎటువంటి లోటు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.





# ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన
# కొండవీటి కోట



పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం పరిధిలోని కొండవీడు గ్రామంలో కొండవీటి కోట ఆంధ్రుల చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. గుంటూరు నగరానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిదుర్గం రెడ్డిరాజుల వైభవానికి, తెలుగు సంస్కృతి సంపదకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. సుమారు 1700 అడుగుల ఎత్తైన కొండలపై నిర్మించబడిన ఈ కోట శత్రుదుర్భేద్య కోటగా ప్రసిద్ధి చెందింది. చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతలను కలగలిపిన ఈ కోట నేటికీ వేలాది మంది సందర్శకులను ఆకర్షిస్తోంది. 14వ శతాబ్దంలో రెడ్డిరాజులు ఈ కోటను నిర్మించి రాజధానిగా చేసుకొని క్రీ.శ. 1325 నుంచి 1425 వరకు పాలన సాగించారు. ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన తొలి రాజు. తొలుత అద్దంకిని రాజధానిగా చేసుకుని పాలించిన ఆయన అనంతరం రాజ్యం అనపోతారెడ్డి చేతికి వెళ్లింది. శత్రు దాడులు పెరగడంతో అనపోతారెడ్డి రాజధానిని కొండవీడుకు మార్చి గిరిదుర్గంగా అభివృద్ధి చేశాడు. అతని కాలంలో కోట మరింత బలపడింది. తరువాత అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి వంటి రాజులు రాజ్యాన్ని విస్తరించి కళలు, సాహిత్యం, సంగీతానికి ప్రాధాన్యం ఇచ్చారు.

పెదకోమటి వేమారెడ్డి పాలన కాలాన్ని కొండవీటి స్వర్ణ యుగంగా పేర్కొంటారు. ప్రసిద్ధ కవి శ్రీనాథుడు ఈ రాజసభలో విద్యాధికారిగా పనిచేసినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. రెడ్డిరాజుల పరిపాలనలో వ్యాపారం, సాహిత్యం, నాట్యం, సంగీతం వికసించాయి. ఉదయగిరి నుంచి ఒడిశాలోని కటక్ వరకు రాజ్యాన్ని విస్తరించిన ఘనత కూడా వీరికి దక్కింది. కొండవీటి కోట నిర్మాణ శైలి అద్భుతంగా ఉంటుంది. కొండలన్నింటినీ కలుపుతూ నిర్మించిన భారీ ప్రాకారం దాదాపు 20 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. 44 బురుజులు, 32 మైళ్ల ప్రాకారాలు, ధాన్యాగారాలు, ఆయుధశాలలు, గుర్రపు శాలలు, రాజప్రాసాదాలు, నేతికొట్టు, కారాగారం వంటి నిర్మాణాలు నాటి వైభవాన్ని గుర్తుచేస్తాయి. కొండ దిగువన ఏర్పాటు చేసిన కందకాల్లో నీరు నింపి మొసళ్లను వదిలేవారని చరిత్ర చెబుతోంది. శత్రువులు కోటలోకి ప్రవేశించకుండా ఉండేందుకు అద్భుత రక్షణ వ్యవస్థను రెడ్డిరాజులు ఏర్పాటు చేశారు. ఈ కోటలోని నీటి నిర్వహణ వ్యవస్థ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. కొండపై ముత్యాలమ్మ, పుట్టాలమ్మ, వెదుళ్ళ చెరువులు నిర్మించి ఒక చెరువు నిండిన నీరు మరొక చెరువుకు చేరే విధంగా రూపొందించారు. ఎత్తైన కొండలపై బావులు తవ్వించి నీటి అవసరాలను తీర్చడం అప్పటి ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం.



ఈ బావుల నుంచే "కొండవీటి చాంతాళ్లు" అనే నానుడి పుట్టిందని చెబుతారు. కొండవీడులో ఆధ్యాత్మిక ప్రాధాన్యత కూడా విశేషమే. గోపీనాథ స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బొల్లుమోర వెంకటేశ్వరస్వామి ఆలయం వంటి అనేక దేవాలయాలు ఇక్కడ ఉన్నాయి. గోపీనాథస్వామి ఆలయాన్ని "కత్తుల బావి" లేదా "చీకటి కోనేరు" అని కూడా పిలుస్తారు. ఆలయాల గోడలపై కనిపించే శిల్ప సంపద నాటి కళాత్మక వైభవాన్ని ప్రతిబింబిస్తుంది.

ఇటీవలి కాలంలో కొండవీడు కోటలో బౌద్ధ ఆనవాళ్లు కూడా బయటపడటం చరిత్రకారుల్లో ఆసక్తి రేకెత్తించింది. ఇక్కడ శాతవాహనుల కాలానికి చెందిన బౌద్ధ స్థూపాలు, పెద్ద ఇటుకలు, మట్టిపాత్రల శకలాలు వెలుగుచూశాయి. సుమారు రెండు వేల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలో బౌద్ధ నాగరికత విస్తరించి ఉన్నట్లు పరిశోధకులు భావిస్తున్నారు. కొండలపై కనిపించే టెర్రాస్ స్థూపాలు పురాతన బౌద్ధ సంస్కృతికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

పర్యాటక దృష్ట్యా కూడా కొండవీటి కోటకు విశేష గుర్తింపు ఉంది. ట్రెక్కింగ్, హైకింగ్‌కు అనువైన ఈ ప్రదేశం సెలవు రోజుల్లో సందర్శకులతో కిటకిటలాడుతుంది. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో కోటపైకి చేరుకోవడం మరింత సులభమైంది. కొండలపై నిలబడి ప్రకృతి అందాలను వీక్షించడం సందర్శకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుంది.

ప్రస్తుతం కొండవీడు కోటను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపునకు తీసుకురావాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ కోటను రక్షిత కట్టడంగా ప్రకటించి పరిరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రతి సంవత్సరం నిర్వహించే "కొండవీటి ఉత్సవాలు" ఈ ప్రాంత చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

తెలుగు జాతి గర్వకారణమైన కొండవీటి కోట చరిత్ర, వైభవం, శిల్పకళ, ప్రకృతి సోయగాలు కలిసిన అపూర్వ కట్టడం. మరింత అభివృద్ధి చేసి ఆధునిక సదుపాయాలు కల్పిస్తే ఇది అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మరింత వెలుగొందే అవకాశం ఉంది.



## అణగారిన వర్గాలకు న్యాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి

- జస్టిస్ నక్కా బాలయోగి

**గుంటూరు మే 23( మనసులో మాట)::**

అనాదిగా సామాజిక అణచివేతకు,ఆర్థిక దోపిడీకి గురై అన్ని రంగాలలోఅన్ని విధాల వెనుకకు నెట్టబడ్డ అణగారిన వర్గాలకు న్యాయం చేయడంలోనే నిజమైన ఆత్మ సంతృప్తి ఉందని, రిటైర్డ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నక్కా బాలయోగి అన్నారు. ఈరోజు స్థానిక మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని వారు సందర్శించగా వారికి జరిగిన ఘన సన్మాన కార్యక్రమ అనంతరం బీసీ నేతలనుద్దేశించి ఆ మేరకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బీసీ సమాజాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. గత అనేక దశాబ్దాలుగా కేసన బీసీ విద్యార్థుల, నిరుద్యోగ యువజనుల,139 బీసీ కులాల,ముఖ్యంగా ఎంబిసిల సమస్యల పైన వారి సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడుతున్నారన్నారు, బీసీల జనాభా దామాషా మేరకు సమస్త జీవన రంగాలలో సామాజిక న్యాయం దక్కాలంటూ వారు నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ఉద్యమాలుపోరాటాలు ఫలప్రదం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ జస్టిస్ నక్కా బాలయోగి న్యాయవాదిగా న్యాయమూర్తిగా తన వృత్తి జీవితమంతా పేదలు బడుగులు దుఃఖితులు పీడిత తాడితుల పక్షాన నిలిచి,సామాజిక న్యాయ మందించేందుకే శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు.సంఘ కార్యకలాపాల గురించి నాయకులు కార్యకర్తలందరిని అడిగి తెలుసుకున్న జస్టిస్ బాలయోగి సంఘాభివృద్ధికి"నేను సైతం" అంటూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వాగ్దానం చేశారు. జస్టిస్ ను పూల మాలలతో బొకేలనిచ్చి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించిన వారిలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి శివరాం బాబాజీ, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు దోకిపర్తి శ్రీనివాసరావు మంగళగిరి పట్టణ అధ్యక్షులు జొన్నాదుల వెంకటకృష్ణ, మహిళా అధ్యక్షురాలు జి జయలక్ష్మి,, దానా గౌడ్ పలువురు బీసీ నాయకులు ఉన్నారు.

## లో వోల్టేజీ కారణంగా నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాం

**వినుకొండ,మే 23 (మనసులో మాట)**

గత రెండు నెలలుగా లో వోల్టేజ్ కారణంగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ప్రస్తుత 22వ వార్డుకు చెందిన కుమ్మరి బజారుకు చెందిన ప్రజలు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఎం. ఎస్.కె.బాష మాట్లాడుతూ గత రెండు నెలలు గా లో వోల్టేజి కారణంగా వార్డులో విద్యుత్ సరఫరా సరిగా ఉండటం లేదని, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించుకున్న ఎటువంటి స్పందన లేని కారణంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు, వార్డులో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు విద్యుత్ లేని కారణంగా అవస్థలు పడుతున్నారని, వార్డుల్లో ప్రజలు దోమకాట్ల వల్ల తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారని మలేరియా, టైఫాయిడ్,డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి అల్లాడుతున్నారని ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు త్వరితగతిన పనిచేయునటువంటి ట్రాన్స్ఫార్మర్ను వెంటనే తీసివేసి దాని స్థానంలో నూతన ట్రాన్స్ఫార్మర్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు, అధికారులు స్పందించని పక్షంలో వార్డులోని ప్రజలందరూ విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించడం జరుగుతుందని నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు, వెంటనే నూతన విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించవలసినదిగా కోరారు.

# ప్రజలంతా సహకరిస్తేనే పరిశుభ్రత సాధ్యం

- ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి
- ఇళ్ల పరిసరాలను క్లీన్ గా ఉంచుకోండి
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి*
- ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ హిమవంశీ
- చీపురుపట్టి రోడ్లు ఊడ్చిన నేతలు, అధికారులు...

**కందుకూరు మే 23 (మనసులో మాట)**

స్వర్ణఆంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో... ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పట్టణంలోని మాచవరం రోడ్డులో శనివారం ఉదయం నిర్వహించారు.*
ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే. అనూష, అధికారులు కూటమి పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సహా అందరూ చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు.*
ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేవలం అధికారులు, పారిశుధ్య సిబ్బంది పనిచేయటం వల్ల స్వచ్ఛత శుభ్రత సాధ్యం కాదన్నారు. పట్టణ ప్రజలు కూడా పూర్తిగా సహకరిస్తేనే, మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని అన్నారు. అప్పుడే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పథకం యొక్క ఆశయం నెరవేరుతుందన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు, తమ చుట్టూ ఉన్న పరిసరాలు క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ఇళ్ళు, దుకాణాలు, ఇంకా అనేక చోట్లనుంచి వచ్చే చెత్తను, పారిశుధ్య సిబ్బంది సూచించిన విధంగా వేరుచేసి ఇవ్వాలన్నారు. కొన్నిదేశాలలో రోడ్లు, కాలువల్లో ఎలాంటి వ్యర్థాలు కనిపించవని, అక్కడి ప్రజలు బాధ్యతగా ఆలోచించడం వల్లే ఆయా ప్రదేశాలు చూడముచ్చటగా ఉంటున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. మన దగ్గర కూడా ప్రజలు అలా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాలు, గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరును ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సులతో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, క్లస్టర్ ఇన్చార్జి వడ్డేళ్ల రవిచంద్ర, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, గుర్రం మల్లికార్జున, అత్తోట మధు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ బాషా, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



## "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు

- చీపురు తో రోడ్లు ఉడుస్తున్న చీఫ్ విప్ జివి ఆంజనేయులు

**వినుకొండ,మే 23,(మనసులో మాట)**

రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'సాసా' (స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర) కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, నగరాలను సంపూర్ణ చెత్త రహిత ప్రాంతాలుగా మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం వినుకొండలో శనివారం ప్రారంభమైంది. ఈ పారిశుధ్య మహోద్యమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా పాల్గొన్నారు. చీపురు పట్టి వీధులను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీరు పోశారు,. ఈ సందర్భంగా చీఫ్ విప్ జివి మాట్లాడుతూ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్ర రూపురేఖలు మారుతున్నాయని, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యానికి శ్రీకారం చుట్టవచ్చని తెలిపారు, గత వైసీపీ ప్రభుత్వం టన్నుల కొద్దీ వ్యర్థాలను పేరుకుపోయేలా చేసి, చెత్త మీద పన్నులు వేసిన ఒక "చెత్త ప్రభుత్వం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. స్వచ్ఛమైన వినుకొండ సాధన కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు,
రాబోయే 4 వారాల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో,మొదటి వారం సమస్యల గుర్తింపుక్లీనింగ్, రెండో వారం డ్రైనేజీల పూడిక తీత, మూడో వారం వ్యాపార సముదాయాలపై ప్రత్యేక నిఘా, నాలుగో వారం సమస్యాత్మక ప్రాంతాలకు శాశ్వత సుందరీకరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు, 4 వారాల సుదీర్ఘ డ్రైవ్ జూన్ 19తో ముగుస్తుందని, అనంతరం జూన్ 20న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అత్యంత భారీ స్థాయిలో 'మెగా క్లీన్‌లెనెస్ డ్రైవ్' నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించాలని ప్రభుత్వం సంకల్పించిందని ఆయన వెల్లడించారు,
ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు, జరిమానాల విధింపు వంటి పూర్తి అధికారాలు కలెక్టర్లకే ఇవ్వబడ్డాయని,మున్సిపల్ అధికారులు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు పర్య□□క్షిస్తారని తెలిపారు. పారిశుధ్యంలో ప్రభుత్వంతో పాటు పౌరులకు 5050 భాగస్వామ్యం ఉందని, తడిపొడి చెత్తను విడివిడిగా మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలని వ్యాపార సంస్థలు కచ్చితంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు, ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకపోతే నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఒక ప్రజా ఉద్యమం. జూన్ 20న జరగబోయే ప్రపంచ రికార్డు డ్రైవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీ ఆంజనేయులు కోరారు. జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ పురపాలక సంఘ కమిషనర్ కోడూరి శివరామ ప్రసాద్, పురపాలక సంఘ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అవినీతికి బ్రాండ్ జగన్.. అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు




**వినుకొండ,మే23,(మనసులో మాట)**

రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్ అయితే.. నవ్యాంధ్ర ప్రగతికి, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు" అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి నాయకులతో కలిసి మాట్లాడారు, గత జగన్ ప్రభుత్వం కేవలం చెత్త పన్నులు వేసి ప్రజలను పీడించిన ఒక చెత్త ప్రభుత్వమని, అదే చంద్రబాబు నాయుడు చెత్తను కూడా సంపదగా మార్చి చూపించిన అపర చాణక్యుడని కొనియాడారు, మట్టి, ఇసుక, రేషన్ బియ్యం సైతం వదలకుండా అమ్ముకున్న ఘనత ఒక్క వైసీపీకే దక్కుతుందన్నారు, రాష్ట్రంలో అవినీతికి బ్రాండ్ జగన్ అయితే, వినుకొండ నియోజకవర్గంలో అవినీతికి బ్రాండ్ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని జీవీ ఘాటుగా విమర్శించారు,గతంలో సొసైటీ బ్యాంకులలో లోన్ల పేరుతో ప్రజల సొమ్మును దోచుకున్నది, ఆ అవినీతి అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చింది వైసీపీ నాయకులేనని మండిపడ్డారు.వారు చేసిన దోపిడీలు, లూటీలకి గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పినా వారిలో ఇంకా మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. కనీసం రోడ్ల గుంతలు కూడా పూడ్చడం చేతకాని వైసీపీ నేతలు, నేడు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ 'సూపర్ సిక్స్' పథకాలను పక్కాగా అమలు చేస్తోందని, ఇవన్నీ చూస్తూ కూడా విమర్శలు చేస్తున్న వారిని ఏమనాలి అంటూ తీవ్రంగా ప్రశ్నించారు, అమరావతి అభివృద్ధి, సూపర్ సిక్స్ అమలు చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో మీరు పోలవరం, అమరావతి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు,దోపిడీ చేయడమే తప్ప అభివృద్ధి చేయడం చేతకాని వైసీపీ నేతలు కళ్ళు లేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని, వైసీపీ కి ఉన్న 11 మంది ఎమ్మెల్యేలు అమరావతికి వచ్చి ఇక్కడి ప్రగతిని కళ్లారా చూడాలని సవాల్ విసిరారు, కేవలం అసత్య ప్రచారాలు చేయడం కోసమే వైసీపీ వాళ్ళు ప్రెస్ మీట్లు పెడుతున్నారని ధ్వజమెత్తారు,జనాభా పెరుగుదలకు అనుగుణంగా వినుకొండలో వార్డుల సంఖ్యను 32 నుండి 36 కి పెంచడం పూర్తిగా శాస్త్రీయంగా జరిగిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు, అదేవిధంగా కూటమి ప్రభుత్వ ప్రగతిని వివరిస్తూ.. 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని, కూటమి అధికారంలోకి రాగానే పెన్షన్లు భారీగా పెంపు చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తుచేశారు. అలాగే నిరుద్యోగుల కోసం రికార్డు స్థాయిలో 16,340 పోస్టుల తో మెగా డీఎస్సీ ఉద్యోగాల భర్తీ చేపట్టామని వివరించారు. రాష్ట్రానికి ఏకంగా రూ.16 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను తీసుకువచ్చామని, పెద్ద సంఖ్యలో భారీ ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తుండటంతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, పర్యావరణ పరిరక్షణ కోసం కోట్లాది మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నిర్ణయం అత్యంత అభినందనీయమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కొనియాడారు,

**జగన్ పై చేసిన సవాల్ కు కట్టుబడి ఉన్నా...**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు జరగడంలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన విమర్శలను కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు, వినుకొండ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల అమలును తాను వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చూపిస్తానని చెప్పిన సవాల్కు తాను నేటికీ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు, వైయస్ జగన్ రాకపోయినా ఆ పార్టీ నాయకుడు బొల్లా బ్రహ్మనాయుడు సొంత గ్రామము వెల్పూర్ లో... టిడిపి నాయకులు లేదా కార్యకర్తలు వచ్చి సూపర్ సిక్స్ పథకాల హామీల అమలను నిరూపిస్తారని దమ్ముంటే బొల్లా బ్రహ్మనాయుడు గానీ జగన్ గానీ రావాలని మరోమారు జివి సవాల్ విసిరారు,ఈ సమావేశంలో ఆయనతోపాటు జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కొండవీడు ఘాట్ రోడ్ జాతీయ రహదారితో అనుసంధానంతో కోటకు పూర్వ వైభవం : ప్రత్తిపాటి

- -ఘాట్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు కేంద్ర మంత్రి గడ్కరీకి అందచేశాం.
- కేంద్రం నుంచి అనుమతులు, నిధులు వచ్చిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభం.
- శారీరక వ్యాయామంతో ప్రశాంతమైన, మెరుగైన ఆరోగ్యం.
- సొలసలో రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ప్రారంభించిన ప్రత్తిపాటి.



**యడ్లపాడు మే 23 మనసులో మాట**

శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతతతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని, మందుల వాడకం.. వైద్యసేవలతో పనిలేకుండానే ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవించవచ్చని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం యడ్లపాడు మండలం సొలస గ్రామంలోని చెరువు కట్టపై రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో రూ.4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ ను స్థానిక నాయకులతో కలిసి ప్రత్తిపాటి లాంఛనంగా ప్రారంభించారు. రోటరీ క్లబ్ సభ్యులు, స్థానికులతో కలిసి కాసేపు జిమ్ లో వ్యాయామం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కొండవీడు ఘాట్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానిస్తూ త్వరలోనే నూతన రోడ్డు మార్గం ఏర్పడనుందని ప్రత్తిపాటి చెప్పారు. కొత్త రహదారి నిర్మాణ వివరాలు, అంచనా వ్యయం సమాచారాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, తాను కేంద్ర మంత్రి గడ్కరీకి అందచేశామన్నారు. కేంద్రం నుంచి నిధులు, పరిపాలనా అనుమతి లభిస్తే, ముఖ్యమంత్రి ఎప్పటినుంచో నిర్మించాలనకుంటున్న చౌడవరం టన్నెల్ నిర్మాణం కూడా పూర్తవుతుందన్నారు. జాతీయ రహదారి నుంచి నేరుగా రోడ్డు అందుబాటులోకి వస్తే, కొండవీడు కోటకు పూర్వ వైభవం లభిస్తుందన్నారు. గతంలో యడ్లపాడు మండలంలో ఎక్కడా చూసినా రోడ్లు అధ్వాన్నంగా ఉండేవని, కూటమిప్రభుత్వం వచ్చాకే అన్నిరోడ్లను అద్దాల్లా తీర్చిదిద్దామన్నారు. రోటరీ క్లబ్ నిర్వాహకులతో పాటు.. గ్రామ నాయకులు వీరారెడ్డి తదితరుల కృషి వల్లే సొలస గ్రామస్తులకు మంచి వ్యాయామశాల అందుబాటులోకి వచ్చిందన్నారు. సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ను కులమతాలు, పార్టీలకు అతీతంగా అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 27, 28 తేదీల్లో వర్చువల్ గా నిర్వహించే మహానాడుని అన్ని గ్రామాల ప్రజలు విజయవంతం చేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రోటరీ క్లబ్ గవర్నర్ డా. ఎస్. వి. రామ్ ప్రసాద్, రోటరీ సభ్యులు వాసిరెడ్డి బాలకోటి రెడ్డి, ఉప్పుటూరి ప్రసాద్, బోడె రామ సుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కళ్యాణ్, అడుసుమల్లి మోహన్ రావు, సాంబశివరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదాం

- దేశీయ అడవి విత్తనాలు సేకరించుదాం
- ఔషధ గుణాలు కలిగిన విత్తనాలు సేకరించడం అవసరం
- పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు విత్తనాలు సేకరించుదాం
- శ్రీనివాసరెడ్డి, సిసిఎఫ్, తిరుపతి సర్కిల్

**గుంటూరు, మే 23( మనసులో మాట) :**

విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదామని తిరుపతి సర్కిల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు అటవీశాఖ కార్యాలయంలో తిరుపతి, గుంటూరు సర్కిల్స్ పరిధిలోని బాపట్ల, ప్రకాశం, గుంటూరు, రాయచోటి, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల డిఎఫ్ఓలు, సోషల్ ఫారెస్ట్రీ అధికారులతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తో విత్తనాల బంతులు తయారు చేయడంపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వం 2.5 కోట్ల విత్తనాల బంతులు తయారు చేయడం జరుగుతుందని వివరించారు. దేశీయ అడవి విత్తనాలు సేకరించుదామని పిలుపునిచ్చారు. ఇందుకుగాను గ్రీన్ క్లైమేట్ టీం సూచించిన అన్ని ప్రాంతాలలోనూ సోమవారం ఉదయం నుంచి విత్తనాలు సేకరించడం అవసరమని గమనించాలని అన్నారు. ఔషధ గుణాలు కలిగిన విత్తనాలు సేకరించడం అవసరమని, అలాగే పక్షులు గూళ్ళు పెట్టే చెట్లు విత్తనాలు సేకరించుదామని అన్నారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి రత్నం మాట్లాడుతూ అరవై నుండి 70 శాతం దేశీయ ఆవు పేడ, 30 నుంచి 40 శాతం మట్టి వినియోగించి, రెండు ఉండలు చేయడానికి అనువుగా కలపాలని వివరించారు. ఆ విత్తనాల సైజ్ ను బట్టి 75 నుండి 150 గ్రాముల మిశ్రమానికి ఏదో ఒక రకం విత్తనాలు మూడు వంతున పెట్టి విత్తనాల బంతులు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బాపట్ల డిఎఫ్ఓ రవిశంకర్, ప్రకాశం జిల్లా డిఎఫ్ఓ వినోద్ కుమార్, గుంటూరు జిల్లా డిఎఫ్ఓ హిమ శైలజ పాల్గొన్నారు.



## మెడికల్ మాఫియాను అరికట్టడంలో
# ప్రభుత్వం నిర్లక్ష్యం

- అక్రమ మెడికల్ రవాణా, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి.
- పల్నాడు జిల్లా ఏఐవైఎఫ్ నాయకులు కె.మల్లికార్జున్, గుండాల హర్ష

**నరసరావుపేట మే 23 (మనసులో మాట):**

జిల్లాలో జరుగుతున్న మెడికల్ మాఫియా అక్రమాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య, (ఏఐవైఎఫ్) అధ్వర్యంలో పల్నాడు జిల్లా కార్యాలయంలో మాధవి కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కే.మల్లికార్జున్ మాట్లాడుతూ అనుమతులు లేని మెడికల్ షాపులను సీజ్ చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అక్రమ మెడికల్ బిల్లులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలనీ జిల్లాలో ఇటీవలి కాలంలో ప్రైవేట్ హాస్పిటల్స్ మరియు కొంతమంది మెడికల్ స్టోర్లు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, ధనార్జనే లక్ష్యంగా పనిచేస్తున్నాయనీ, పుట్టగొడుగుల్లా పెరుగుతున్న ఈ ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజారోగ్యాన్ని సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి దోపిడీకి పాల్పడుతున్నాయనీ విమర్శించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల బలహీనతను ఆసరాగా చేసుకొని అవసరానికి మించిన బిల్లులు వేయడం,అవసరం లేని పరీక్షలు మరియు చికిత్సలు చేయించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నారనీ మండి పడ్డారు. జిల్లాలో కొంతమంది మెడికల్ స్టోర్లు చట్టాలను పక్కనబెట్టి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందుల విక్రయం, అనుమతి లేని అబార్షన్ మాత్రల రహస్య అమ్మకాలు, లైసెన్స్ లేకుండా మెడికల్ షాపుల నిర్వహణ వంటి అక్రమాలకు పాల్పడుతున్నారనీ అన్నారు.ఈ పరిస్థితి సాధారణ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాబట్టి తక్షణమే ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ ,డిఎం అండ్ హెచ్‌ఓ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా మెడికల్ స్టోర్లు, ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో విచారణ చేపట్టి కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ మరియు సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత కాబట్టి వెంటనే చర్యలు తీసుకుని ఈ అక్రమాలను అరికట్టాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు వైదన వెంకట్, నాయకులు హర్ష, వెంకటేష్,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు

**కొల్లూరు మే 22(మనసులో మాట):**

శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య మాట మాట పెరిగి తీవ్ర ఘర్షణకు దారితీసిందని రేపల్లె డిఎస్పి ఏ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కొల్లూరు పోలీస్ స్టేషన్ లో డిఎస్పీ మాట్లాడుతూ కొల్లూరులోని ఓ వైన్ షాప్ సమీపంలో కొల్లూరుకు చెందిన ఉప్పు జానకిరామయ్య, కొండూరు సురేష్‌కి మధ్య గొడవ పెరిగి సురేష్ బీరు బాటిల్ తో జానకిరామయ్య తల మీద కొట్టాడన్నారు. జానకిరామయ్య పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసే సమయంలో అతని మేనల్లుడు బాలు దళితవాడలోకి వెళ్లి ఛాలెంజ్ చేశాడన్నారు. దీంతో దళితవాడలోని కొంతమంది పోలీస్ స్టేషన్ కు వెళ్లి జానకిరామయ్య తో ఘర్షణకు దిగి విచక్షణారహితంగా రక్తం వచ్చే వరకు తన్నుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్లను ఫర్నిచర్ మొత్తాన్ని నాశనం చేశారన్నారు.





# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యగా మారాలి

- క్లీన్ స్వీప్ లో భాగంగా చీపురు పట్టి రోడ్డు శుభ్రం చేసిన ప్రత్తిపాటి.
- తాటిముంజలమ్మే చిన్నారులతో మాట్లాడి, ముంజలు కొని రుచిచూసిన ఎమ్మెల్యే.

**చిలకలూరిపేట మే 23 మనసులో మాట**

ప్రజల భాగస్వామ్యం, వారి బాధ్యతాయుత పనితీరుతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన చిలకలూరిపేటలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టిన ప్రత్తిపాటి.. స్థానిక నాయకులతో కలిసి రోడ్డు శుభ్రం చేశారు. అనంతరం ఒక కూడలిలో తాటిముంజలు అమ్ముతున్న చిన్నారులతో మాట్లాడి, ఎక్కడి నుంచి వచ్చారు. తాటికాయలు ఎక్కడ తెచ్చారు.. అన్నీ అమ్మితే ఎంత లాభం వస్తుందని వారిని ప్రశ్నించగా, పిల్లలు ఉత్సాహంగా ప్రత్తిపాటికి సమాధానమిచ్చారు. అనంతరం వారి వద్ద ముంజలు కొనుగోలు చేసి రుచిచూసిన ప్రత్తిపాటి బాగున్నాయని వారిని మెచ్చుకున్నారు.
ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజలు తమ సొంతపనులుగా భావించాలి అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ క్లీన్ స్వీప్ అయినా.. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయన్నారు. ప్రభుత్వం వీధులు, పట్టణాలు, గ్రామాల శుభ్రతను ఒక ప్రాజెక్టులా నిర్వహిస్తోందని, అలాంటప్పుడు ప్రజలు ఇష్టానసారం వ్యవహరిస్తే ఉపయోగం ఏముంటుందని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలంటే, దానిని ప్రజలు తమ సొంత పనిగా భావించాలన్నారు.
ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రజల దినచర్యలో భాగం కావాలన్న ప్రత్తిపాటి.. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలే సుస్థిర అభివృద్ధికి అసలైన ప్రామాణికాలుగా నిలుస్తాయన్నారు. హరితాంధ్ర, స్వచ్ఛాంధ్ర అనేవి కేవలం నినాదాలు కావని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే గొప్ప కార్యక్రమాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, హరితాంధ్ర కార్యక్రమాలతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.
కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మస్తాన్ వలి, బేరింగ్ మౌలాలి, తుపాకుల అప్పారావు , మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు , అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్ వేదికను దుర్వినియోగం చేస్తున్నారు..

- విచారణలు పక్కదోవ పట్టించేందుకే నకిలీ అర్జీలు.. అడ్డుకట్ట వేయాలన్న ఉద్యోగ సంఘాలు
- కలెక్టర్‌కు ఏపీజీఈఏ సంచలన వినతి!

**నరసరావుపేట మే 23 మనసులో మాట)::**




ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందించడంతో పాటు వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" అర్జీలను నిశితంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, పల్నాడు జిల్లా కలెక్టర్‌ను కోరింది. కొందరు అర్జీదారులు ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ తాము చేసిన తప్పుల నుండి తప్పించుకోవడానికి మరియు తమపై జరుగుతున్న ప్రభుత్వ విచారణలను ప్రక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని దీనివల్ల ప్రభుత్వ అధికారులపై అదనపు, అనవసర పనిభారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు సంఘ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కొంతమంది అర్జీదారులు ఒకే విషయంపై కంటెంట్‌ను కొంచెం మార్చి పలుమార్లు పిటిషన్లు దాఖలు చేస్తూ అర్జీలను పునరావృతం చేస్తున్నారని పేర్కొన్నారు.అలాగే తాము కోరిన సమస్య ఇప్పటికే జిల్లా కోర్టు లేదా హైకోర్టు పరిధిలో ఉండి విచారణ జరుగుతున్నప్పటికీ, ఆ విషయాన్ని దాచిపెట్టి పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు పెడుతున్నారని వివరించారు. నిధుల దుర్వినియోగం,అవినీతి, మోసం,రికార్డుల తారుమారు వంటి తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటూ ప్రభుత్వ విచారణలో ఉన్న కొందరు వ్యక్తులు, పి.జి.ఆర్.ఎస్ ద్వారా ఆ విచారణలను ప్రక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.సదరు అర్జీదారులను సమస్య పరిష్కార నిమిత్తం ప్రభుత్వ ఎంక్వైరీ అధికారి నోటీసు ఇచ్చి పిలిచినా, వారు సరైన వివరాలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలు సమర్పించడం లేదని దీనివల్ల సమస్య పరిష్కారానికి ఏమాత్రం తోడ్పాటం లేదని తెలిపారు. అర్జీదారులు తమ సమస్య పరిష్కారం కోసం ముందుగా సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారులను సంప్రదించకుండా, నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిటిషన్లు ఇస్తున్నారని దీనివల్ల ఆయా విభాగాల అధికారులకు సమస్యపై ముందస్తు అవగాహన కరువవుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ఏ.పీ.జి.ఈ.ఏ అధ్యక్షుడు స్వర్ణ చిన రామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సంఘ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయాలను గమనించడం జరిగిందని తెలిపారు. ఇటువంటి నిరాధారమైన నకిలీ అర్జీదారులపై అధికారులు ఒక కన్నేసి ఉంచాలని కోరారు. ఇలాంటి అనవసరమైన అర్జీలను విచారణ చేయడానికి ఉద్యోగులకు కనీసం 3 పనిదినాల సమయం పడుతోందని, దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర వృధా ప్రయాసకు గురి అవుతున్నారని అందుకే ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన వివరించారు.ఈ సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి చుక్కా వెంకటేశ్వర్లు, జాయింట్ కార్యదర్శి షేక్ బాజీ, నరసరావుపేట తాలూకా అధ్యక్షులు ఎం.ఫ్లోరెన్స్, కార్యదర్శి జి.వందనం బాబు,సంఘ ప్రతినిధులు రేణుక,మాధవీ లత, లక్ష్మి జ్యోతి,కుంచాల శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాస్తున్నారు

- ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.ఎల్. రామాంజనేయులు
- గిరిజన సమాఖ్య బలోపేతానికి సిపిఐ పూర్తి మద్దతు - ఏ. మారుతి వరప్రసాద్

**నరసరావుపేట మే 23 (మనసులో మాట):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను పూర్తిగా కాలరాస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.ఎల్. రామాంజనేయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.శనివారం నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోధీ స్విస్ బ్యాంకులోని నల్లధనాన్ని తీసుకొచ్చి పేద ప్రజలకు పంచుతానని నమ్మబలికారని, ప్రజల చేత జీరో అకౌంట్లు తీయించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని దుయ్యబట్టారు.ఎన్నికల హామీల్లో భాగంగా పేదలందరికీ నివేశన స్థలాలు ఇస్తామని చెప్పి, నేటికీ ఒక్క



సెంటు స్థలం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్పొరేషన్ ద్వారా ఎస్టీలకు రుణ సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గిరిజన సమస్యల పరిష్కారం కోసం పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడు, సేవాలాల్ మహారాజ్, చెంచులక్ష్మి వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన హక్కుల సాధన కోసం ముందుకు సాగాలన్నారు. పల్నాడు జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉందని వారి హక్కుల రక్షణ కోసం గిరిజన సమాఖ్యను బలోపేతం చేసేందుకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పేద ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాడుతుందని గిరిజన కమిటీల ఏర్పాటుకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం పల్నాడు జిల్లా గిరిజన సమాఖ్య నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బి. శ్రీను నాయక్, కమిటీ సభ్యులుగా కోయా శీను, వాకుడావతు శివుడు నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, రమావతు సురేష్ నాయక్, కేతావతు రంగనాయకులు, వాకుడావతు నాగేశ్వరరావు, సి.హెచ్. నాగరాజు, లక్ష్మా నాయక్, భూక్య నరసింహ నాయక్ (మొత్తం తొమ్మిది మంది సభ్యులు, ఒక కన్వీనర్) ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు జి.రవీంద్ర, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పాల పాటి రంగయ్యతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రత్తిపాటి



**నాదెండ్ల మే 23, మనసులోమాట:** నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని తుర్లపాడు మేజర్ సాగునీటి సరఫరా సంఘం డిస్ట్రిబ్యూటరి కమిటీ (DC) అధ్యక్షుడు నెల్లూరి రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ రోజు ఎండుగుంపాలెం గ్రామంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో శివశక్తి గ్రూపు సంస్థల చైర్మన్ నందిగం శ్రీనివాసరావు ,మాజీ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మానం వెంకటేశ్వర్లు,టీడీపీ రాష్ట్ర నాయకులు దగ్గుమల్లి సాంబశివరావు, గట్టినేని రమేష్, దగ్గుమల్లి వెంకటేశ్వర్లు పలువురు టీడీపీ నాయకులు రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

## జిల్లాలో పారాక్వాట్ డైక్లోరైడ్ విక్రయాలపై తక్షణ నిషేధం

**గుంటూరు, మే 23( మనసులో మాట) :** జిల్లాలో పారాక్వాట్ డైక్లోరైడ్ (పారాక్వాట్ డిక్లోరైడ్ 24% SL) విక్రయాలపై తక్షణ నిషేధం విధించినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి తెలిపారు. ఈ మేరకు జిల్లాలో పలు దుకాణాలలో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల (జి .ఓ .rtn.421, తేదీ: 22/05/2026) ప్రకారం, అత్యంత ప్రమాదకరమైన "పారాక్వాట్ డైక్లోరైడ్, దాని ఇతర రూపాల (ఫార్ములాషన్స్ ) విక్రయాలు, పంపిణీ, వాడకాన్ని గుంటూరు జిల్లా వ్యాప్తంగా తక్షణం నిషేధించినట్లు చెప్పారు. జిల్లాలోని ఇన్సెక్టిసైడ్ ఇన్స్పెక్టర్లు (ఇన్సక్టిసైడ్ ఇన్స్పెక్టర్స్ ) నిల్వ ఉంచిన పారాక్వాట్ డైక్లోరైడ్ పురుగు మందుపై అమ్మకాల నిలిపివేత నోటీసులు జారీ చేయడం జరిగిందని వెల్లడించారు. ఇందులో భాగంగా రిటైల్ వ్యాపారుల వద్ద 22,606.75 లీటర్లు., హోల్ సేల్ వ్యాపారుల వద్ద 65,010.50 లీటర్లు వెరసి 87,617.25 లీటర్ల పారాక్వాట్ డైక్లోరైడ్ నిల్వలకు సంబంధించి తక్షణమే "స్టాప్ సేల్" (అమ్మకాల నిలిపివేత) నోటీసులు జారీ చేయడం జరిగిందని వివరించారు. ఇటీవల కాలంలో పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును తాగడం వల్ల క్షణాల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోతూ అనేక ఆత్మహత్యల సంఘటనలు నమోదయ్యాయని పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ ), వైద్య ఆరోగ్య శాఖ నివేదికలు స్పష్టం చేశాయన్నారు. ఈ మందు శరీరంలోకి వెళ్తే ప్రాణాలు కాపాడటానికి ఎటువంటి విరుగుడు (ఏంటిదోతే ) ప్రస్తుతం అందుబాటులో లేదని, ఇది ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా మారిందని, ఇందుకుగాను ప్రభుత్వం నిషేధానికి నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిషేధం గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల పాటు అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలోని తయారీదారులు, పంపిణీదారులు, హోల్‌సేల్, రిటైల్ డీలర్లు ఎవరూ ఈ పారాక్వాట్ డైక్లోరైడ్ మందును విక్రయించరాదని, నిల్వ ఉంచరాదని హెచ్చరించారు. ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవరైనా దొంగచాటుగా అమ్మకాలు జరిపితే, కీటకనాశినుల చట్టం, 1968 (ఇన్సక్టిసిడ్స్ యాక్ట్ , 1968) ప్రకారం వారి లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. రైతులు ఈ గడ్డిమందు ప్రాణాంతక స్వభావాన్ని గ్రహించి, దీని వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరారు.

## నూతన వస్త్ర బహుకరణ వేడుకలో పాల్గొన్న శాసనమండల, సభ్యులు మర్రి రాజశేఖర్



**నాదెండ్ల మే 23, మనసులోమాట:** నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామ వాస్తవ్యులు గొట్టిపాటి సత్యనారాయణ, కుమార్తె నూతన వస్త్ర బహూకరణ వేడుక వారి స్వగృహం నందు జరుగుచుండగా ఆ వేడుకకు హాజరై చిన్నారి సుప్రియ ను ఆశీర్వదించిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్, చిలకలూరిపేట జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి,శ్రీ తోట రాజ రమేష్. ఈ వేడుకలో వారివెంట షేక్ మునీర్ , సాంబశివరావు ,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్



**రేపల్లె మే 23మనసులోమాట:** ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో ముమ్మర పారిశుధ్య కార్యాచరణ. కార్యక్రమాన్ని ఆర్డిఓ శ్రీదేవి ప్రారంభించారు ఈ సందర్భంగాశనివారం ఆర్డిఓ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు మున్సిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి (ఎం ఏ &యూ డి ) శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' మార్గదర్శకాల ప్రకారం పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించ టం జరిగిందన్నారు. ఇందులో భాగంగా స్థానిక ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో విస్తృతంగా శ్రమదానం మరియు పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందిఅని తెలియ జేశారు. ఈ పారిశుధ్య డ్రైవ్‌లో గౌరవనీయులైన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్ డి ఓ ) మరియు గౌరవనీయులైన మున్సిపల్ కమిషనర్ స్వయంగా పాల్గొని శ్రమదానం చేసి సిబ్బంది అందరికీ ఆదర్శంగా నిలిచారు.స్థానిక శానిటేషన్ సెక్రెటరీలు వార్డు స్థాయి ప్రణాళికతో పర్యవేక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని అత్యంత సమర్థవంతంగా ,విజయవంతంగా నిర్వహించారుఅని తెలియజేశారు అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరులు తమ పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గృహాల సముదాయాల్లో గృహాల చుట్టూ మురుగునీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు వీధులను మురికి చేరారని ఆమె చూపించారు ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది మున్సిపల్ రెవిన్యూ ఆర్డీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# నరసరావుపేటలో మంచినీటి చలివేంద్రం ప్రారంభం

- **ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ**




**నరసరావుపేట మే 23 (మనసులో మాట):**
నరసరావుపేట పట్టణంలోని గడియారం స్తంభం వద్ద శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దివ్య ఆశీస్సులతో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో ఏపీ బుల్లియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో ప్రజలకు దాహం తీర్చేందుకు విశ్వబ్రాహ్మణ సంఘం చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయం అని అని అన్నారు.ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కపిలవాయి విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో ప్రారంభించిన ఈ చలివేంద్రం నిరంతరాయంగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు, పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# మీసేవ కేంద్రంలో చోరీ.. లక్ష రూపాయల నగదు అపహరణ

**వేటపాలెం మే 23 మనసులో మాట:**
బాపట్ల జిల్లా వేటపాలెం మండలం అక్కయ్యపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న మీసేవ కేంద్రంలో లక్ష రూపాయల నగదు చోరీకి గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మీసేవ నిర్వాహకుడు కందుల కుమార్ రాజా తెలిపిన వివరాల ప్రకారం, ఇంటి కిటికీకి దోమల మెష్ ఏర్పాటు చేయించేందుకు ఓ యువకుడితో మాట్లాడినట్లు తెలిపారు. సదరు యువకుడు స్నేహపూర్వకంగా మాట్లాడుతూ, సాయంత్రం సమయంలో మీసేవ కేంద్రంలో ఉన్న కుమార్ రాజాను “ఒకసారి కిటికీ పరిశీలిద్దాం” అంటూ పై అంతస్తుకు పిలిచినట్లు చెప్పారు. అయితే కుమార్ రాజా “రేపు ఉదయం చూద్దాం” అని చెప్పినా, “రేపే పని ప్రారంభిస్తాను.. ఇప్పుడే చూసేద్దాం” అంటూ అతడిని ఒప్పించినట్లు తెలిపారు. దీంతో కుమార్ రాజా పైకి వెళ్లగా, ఇంటి మీదకు వెళ్లే మెట్ల వద్ద ఆ యువకుడు ఫోన్‌లో మాట్లాడుతూ అతని దృష్టిని మరల్చినట్లు చెప్పారు. ఇదే సమయంలో మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మీసేవ కేంద్రంలోకి ప్రవేశించి, డ్రాయర్‌లో ఉన్న లక్ష రూపాయల నగదును అపహరించి పరారైనట్లు వెల్లడించారు. ఈ ఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో, బాధితుడు వెంటనే వేటపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు



కేసు నమోదు చేసి, సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

# వీధి కుక్కల సమస్యకు వినూత్న పరిష్కారం

- **ప్రయోగాత్మకంగా శునకాలకు పునరావాసకేంద్రాలు**

**గుంటూరు మే 23 (మనసులో మాట):**
నగరంలో పైలెట్ ప్రాజెక్ట్ గా 3 ప్రాంతాల్లో డాగ్ ఫీడింగ్ షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ మయూర్ అశోక్ వెల్లడించారు.గుంటూరు నగర పరిధిలో వీధి కుక్కల సమస్యను శాస్త్రీయంగా పరిష్కరించేందుకు మరియు ప్రజలకు, జంతు ప్రేమికులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు గుంటూరు నగరపాలక సంస్థ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు, నగరంలో వీధి కుక్కలకు రెగ్యులర్‌గా ఆహారం అందించే (డాగ్ ఫీడర్స్) వారి సౌకర్యార్థం మరియు పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా రూపొందించిన "డాగ్ ఫీడింగ్ షెడ్ లను" జీఎంసి అందుబాటులోకి తెచ్చిందని మయూర్ అశోక్ తెలిపారు. వీధి కుక్కల బెడదపై అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో




అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే జంతు ప్రేమికుల విన్నపాలను పరిగణలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఆహారం వేయడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తడమే కాకుండా, కుక్కలు గుంపులుగా చేరి స్థానిక ప్రజలపై, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు పాదచారులపై దాడులు చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా తొలివిడతగా నగరంలోని రామిరెడ్డి నగర్, మరియు ఏటి అగ్రహారం పరిధిలోని పలు కీలక ప్రాంతాలలో ఈ ప్రత్యేక డాగ్ ఫీడింగ్ షెడ్ లను పైలట్ ప్రాజెక్ట్ కింద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నివాస ప్రాంతాలలో వీధి కుక్కల సంచారం మరియు దాడుల తీవ్రతను తగ్గించడంతో పాటు రోడ్లపై ఆహార వ్యర్థాలు పేరుకుపోకుండా, దోమలు మరియు ఈగలు ప్రబలకుండా నివారించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జంతు ప్రేమికులు మరియు నగర ప్రజలు ఎవరైనా వీధి కుక్కలకు ఆహారం లేదా నీరు అందించాలని అనుకుంటే, దయచేసి బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై వేయకుండా, కార్పొరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సదరు షెడ్ లలోనే ఆహారాన్ని అందించాలని కోరారు. దీనివల్ల కుక్కలు ఒకే చోట క్రమశిక్షణతో ఆహారం అలవాటు చేసుకుంటాయని, తద్వారా వీధుల్లో తిరిగే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేదా భయాందోళనలు కలగవని తెలిపారు. ప్రజలు జీఎంసి తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించి గుంటూరు నగరాన్ని సురక్షితమైన, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు.

# వేసవి విజ్ఞాన శిబిరంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలు



**తెనాలి మే23(మనసులో మాట):**
ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయం తెనాలి గ్రేడ్ 1నందు శనివారం పిల్లల వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం వేడుకలునిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కవి రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పల్లెటూరు పట్టణ వాతావరణాన్ని పోల్చుతూ నేడు వున్న జీవ రాశుల అసమతుల్యతను నివారించవలసిన అవశ్యకతను, పశు పక్ష్యాదులు,వృక్ష సంపద,వాతావరణ పరిస్థితులపై తన కవితలో పిల్లలకు వివరించినారు. పిల్లలు వారి అమ్మమ్మ ఊళ్లకు వెళ్ళిన సందర్భంలో పొందిన జీవ వైవిధ్య అనుభూతులను పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో సైన్స్ ఉపాధ్యాయులు రాయపాటి శివ నాగేశ్వరరావు, గుంటుపల్లి శ్రీహరి ప్రసాద్, జీవ వైవిధ్యం మన ఇంటి నుండి ప్రారంభించాలని తెలియజేశారు. శనగ పల్లి ఉమామహేశ్వర రావు మాస్టారు హిందీ బోధించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్. లావణ్య సుధ రికార్డు అసిస్టెంట్ పర్యవేక్షించారు. హెల్పర్ కె.పద్మావతి సహకరించారు.

# సత్తెనపల్లి పట్టణంలో కార్డన్ సెర్చ్..




- **81 ద్విచక్ర వాహనాలు, కారు, ఆటో సీజ్.**

**సత్తెనపల్లి, మే 23: (మనసులో మాట) :**
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇంచార్జ్ డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని కొత్తపేట నాగన్నకుంట ప్రాంతంలో శనివారం విస్తృత స్థాయి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 81 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన యజమానులు అధికారిక పత్రాలను సమర్పించి ధృవీకరించుకుంటే తిరిగి అప్పగిస్తామని తెలిపారు. పత్రాలు సమర్పించని పక్షంలో స్వాధీనం చేసుకున్న వాహనాలను సోమవారం కోర్టుకు అప్పగించనున్నట్లు చెప్పారు. గతంలో రంగా కాలనీలో కూడా ఇలాంటి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు పేర్కొన్న ఆయన, నాగన్నకుంట ప్రాంతంలో గంజాయి విక్రయాలు, కాలేజీ విద్యార్థులకు మాదక ద్రవ్యాల సరఫరా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కాలేజీకి వెళ్లే సమయంలో వారి స్నేహాలు, సంచారాలపై నిఘా ఉంచాలని, చెడు అలవాట్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో సుమారు 180 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు.

# స్పందించని అధికారులు



**ప్రత్తిపాడు మనసులో మాట న్యూస్ మే 23 :** ప్రత్తిపాడు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని మే 20 తారీకున పేపర్లో ఇచ్చినప్పటికీ కూడా, స్పందన కరువై ఇంకా వెలగని వీధి దీపాలు. ఎన్నిసార్లు పేపర్లో వేసిన మేము ఇంతే మేము మారం ఎవరికైనా చెప్పుకోండి అన్నట్టుగా అధికారుల నైజం. చిన్నపిల్లలు ఉన్నారు ముసలి వాళ్లు ఉన్నారు. ఎంతోమంది నిత్యం ఈ దారిలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. కొన్ని నెలల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని ఎన్నోసార్లు మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోయింది. అయ్యా ఎమ్మెల్యే సారు మీరన్న మా పంచాయతీ అధికారులకు చెప్పండి అయ్యా మా వీధి దీపాలు వెలిగించమని చెప్పండి అయ్యా అంటూ ఎమ్మెల్యే సార్ ని వేడుకుంటున్నా ప్రజలు...

# వార్డుల పునర్విభజనపై వైయస్సార్సీపి అభ్యంతర పత్రం



**సత్తెనపల్లి, మే 23 (మనసులో మాట):** సత్తెనపల్లి పట్టణంలో మున్సిపల్ వార్డుల పునర్విభజన పై వైయస్ఆర్సీపీ పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి ఆధ్వర్యంలో వైకాపా మున్సిపల్ కౌన్సిలర్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి మాట్లాడుతూ వార్డు డిలిమిటేషన్ నోటిఫికేషన్లో సమాన జనాభా సూత్రం ఉల్లంఘించారని, ప్రతిపాదన వార్డులలో జనాభా అధికారకంగా ప్రకటించకపోవడం ఇది సమాన ప్రతినిధిత్వ హక్కును దెబ్బతీస్తుందని తెలియజేశారు. పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసమే సరిహద్దుల మార్పు గా ఉందని కొన్ని ప్రాంతాలను ఉద్దేశపూర్వకంగా విడగొట్టడం కలపడం ద్వారా రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా డీలిమిటేషన్ చేసినట్టు కనిపిస్తుందని రిజర్వేషన్ల కేటాయింపులో అసమానతగా ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఉమెన్ రిజర్వేషన్ కేటాయింపులు జనాభా నిష్పత్తి రొటేషన్ విధానం సక్రమంగా అమలు కాలేదని తెలియజేశారు.మాజీ కౌన్సిలర్ గని మాట్లాడుతూ గుంటూరు హైదరాబాద్ ప్రధాన రహదారి కి కుడివైపున ఉన్న వార్డు అనగా పాత 10వ వార్డ్ ప్రస్తుతం 13వ వార్డు రోడ్డుకు ఎడమ వైపున ఉన్న వార్డు గతంలో 11వ వార్డు ఇప్పుడు 14 వ వార్డు కలపటం చట్ట విరుద్ధం అంతేకాకుండా ఓసి ప్రాతినిధ్యం వహించే వార్డులోకి ఎస్సీ అధికంగా ఉండి ఎస్సీలకు రిజర్వేషన్ అయిన వార్డు ఎస్సీ జనాభాను చేర్చడం సహజ సరిహద్దులను పరిగణంలోకి తీసుకోకపోవడం భౌగోళిక సంబంధం లేని రెండు వార్డులను కలపటం అనేక అనుమానాలకు దారితీస్తుందని తెలియజేశారు. నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు మునావత్ ఏడుకొండలు మాట్లాడుతూ ఒకే వార్డుకు చెందిన ప్రజలను ఒకే ప్రాంతంలో ఉన్న వారి అభిప్రాయాలను తీసుకోకుండా కలపటం ఒక వార్డులో ఉన్నవారిని ఆ వార్డు కాకుండా పక్కవార్డులో కలపటం వార్డు పునర్విభజనను సక్రమంగా చట్టబద్ధంగా చేయలేదనడానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయనీ ఇప్పటికైనా చట్టబద్ధంగా సరిచేయాలని లేని పక్షంలో చట్టపరంగా ముందుకు వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ ,వార్డు ,పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి కట్టుబాటు : మంత్రి బాల వీరాంజనేయ స్వామి





**మార్కాపురం 23 (మనసులో మాట):** విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లా లోని విభిన్న ప్రతిభావంతులకు ఉచిత మూడు చక్రాల స్కూటర్ ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కింద 17.5 కోట్లతో 1750 మందికి వీటిని అందజేస్తున్నట్లు వివరించారు. మార్కాపురం జిల్లాలో మొదటి విడతగా మొత్తం 40 స్కూటర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 4.32 కోట్లతో దివ్యాంగుల హాస్టల్స్ ను రిపేర్ చేస్తున్నామన్నారు. విశాఖపట్నంలో 200 కోట్లతో ప్యారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు డిసబుల్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు త్వరలో దీనికి పూర్తిస్థాయి అధికారులను నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో 300 విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ప్రతి జిల్లాలో ఒక దివ్యాంగ భవనాన్ని నిర్మిస్తామని వివరించారు. అంతేకాకుండా ప్రతి జిల్లాలో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక డాక్టర్లను నియమిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న ఈ స్కూటర్లు వారి దైనందిక జీవితంలో మంచిగా ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా మీకు కృత్రిమ పరికరాలు సైతం అందజేయడం జరుగుతుందని మరింత విశ్వాసంతో మీరు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విభిన్న ప్రతిభావంతులకు సమాన అవకాశాలు పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి. నారాయణస్వామి, మార్కాపురం గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, భాజపా జిల్లా అధ్యక్షులు కృష్ణారావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లి ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్





**సత్తెనపల్లి మే 23 (మనసులో మాట):** పట్టణాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, పరిశుభ్రంగా రూపొందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా ఇన్ఛార్జి కలెక్టర్ సంజన సింహ పిలుపునిచ్చారు. నెల రోజుల ఈ ప్రత్యేక కార్యక్రమానికి సత్తెనపల్లి మున్సిపాలిటీ ల్లో శ్రీకారం చుట్టారు.ముందుగా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్ నందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహించారు.పరిసరాల్లో ఉన్న వ్యర్థాలను చీపిరి పట్టి స్వయంగా ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం కూటమి శ్రేణులు, అధికారులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఇన్ఛార్జి కలెక్టర్ సంజన సింహ మాట్లాడుతూ..

పరిసరాలు పరిశుభ్రత పాటించడం మనందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ వ్యాపారస్థులను కోరారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. వారానికో ప్రాధాన్యతాంశంతో నెలరోజులపాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. యెల్లో స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చి గోడలపై నైతిక బోధనలతో కూడిన పెయింటింగ్స్ వేయిస్తామని తెలిపారు. ప్రజలు తమ ఇంటివద్దనే తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి ఇవ్వాలని సూచించారు. సత్తెనపల్లి పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మున్సిపాలిటీగా మార్చడంలో ప్రజలంతా తమవంతు సహకారాన్ని అందించాలని ఇన్ఛార్జి కలెక్టర్ కోరారు. మన ప్రాంతాన్ని మనమే బాగు చేసుకొనేందుకు ప్రజలంతా ముందుకు రావాలని, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం, విధివిధానాలు, నిర్వహణ గురించి మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో,టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు,వివిధ హోదాల్లో వున్న కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది tపాల్గొన్నారు.

# జీన్స్, చుడీదార్, నైటీలలో అమ్మ "కొంగు" ఎక్కడ దొరుకుతుంది?

- కనుమరుగవుతున్న కన్నతల్లి కొంగు..
- అమ్మ కొంగులో అర్థం కాని ఎన్నో విషయాలు..

**ప్రత్తిపాడు మనసులో మాట న్యూస్ మే 23:**
పాఠశాలలో, ఉపాధ్యాయురాలు విద్యార్థులను "అమ్మ కొంగు" పై ఒక వ్యాసం రాయమని అడిగారు.
ఒక విద్యార్థి రాసిన విషయం ఎంత హృదయానికి హత్తుకునేలా ఉందంటే, అది మీ మనసును భావోద్వేగాలతో నింపేస్తుంది... గౌరవనీయ ఉపాధ్యాయురాలీ, అమ్మ కొంగు కేవలం ఒక వస్త్రపు ముక్క మాత్రమే కాదు; అది అమ్మ యొక్క గౌరవం మరియు ఔన్నత్యం.పొయ్యి మీద ఉన్న వేడి పాత్రలను దించడానికి అమ్మ కొంగునే ఉపయోగించేవారు.అది పిల్లల చెమటను, కన్నీళ్లను తుడిచేది; మురికి పట్టిన ముఖాలను, చెవులను, చిట్టి చేతులను శుభ్రం చేసేది. భోజనం చేసిన తర్వాత, అమ్మ కొంగుతో మా ముఖాలను తుడిపించుకోవడంలో ఒక ప్రత్యేకమైన హాయి ఉండేది . మా కళ్ళలో ఏదైనా పడినప్పుడు, అమ్మ కొంగును మెలివేసి, తన ఊపిరితో దాన్ని మెల్లగా వెచ్చబరిచి, కంటిపై ఉంచేది — ఎందుకో తెలియదు గానీ, ఆ నొప్పి వెంటనే మాయమైపోయేది.
అమ్మ ఒడిలో నిద్రించే పిల్లలకు, ఆమె ఒడి మృదువైన పడకగా, ఆమె కొంగు హాయినిచ్చే దుప్పటిగా మారేది. ఇంట్లోకి ఎవరైనా కొత్తవారు వచ్చినప్పుడు, పిల్లలు భద్రత కోసం అమ్మ కొంగు వెనుక దాక్కునేవారు.
పిల్లలకు సిగ్గు అనిపించినప్పుడు, వారు అమ్మ కొంగుతో తమ ముఖాన్ని కప్పుకునేవారు.
పిల్లలు బయటకు వెళ్ళినప్పుడు,



వారు అమ్మ కొంగును పట్టుకునేవారు; అది వారికి మార్గదర్శిగా, రక్షణ కవచంగా నిలిచేది. పిల్లలు అమ్మ కొంగును పట్టుకుని ఉన్నంత సేపు, ఈ ప్రపంచమంతా తమ చేతిలోనే సురక్షితంగా ఉన్నట్లు వారికి అనిపించేది. చలికాలంలో, చలి నుండి రక్షించడానికి అమ్మ తన కొంగుతో పిల్లలను నలువైపులా చుట్టేసేది. భారీ వర్షం కురిసినప్పుడు, అదే కొంగు గొడుగులా మారి పిల్లల ముఖాన్ని కప్పేది. చేతులు తుడుచుకోవడానికి అమ్మ కొంగును తువ్వాలులా కూడా ఉపయోగించేవారు.
చెట్ల కింద రాలిన పూలను, పండ్లను సేకరించి అందులోనే మోసుకొచ్చేది. కొన్నిసార్లు, ధాన్యాన్ని, నైవేద్యాన్ని లేదా ప్రసాదాన్ని అందులోనే సేకరించేవారు. ఇంటి సామాన్లను దుమ్ము దులపడానికి, శుభ్రం చేయడానికి కూడా దాన్ని ఉపయోగించేవారు. ఏదైనా వస్తువు పోయినప్పుడు, అది త్వరలోనే దొరుకుతుందని నమ్మి అమ్మ తన కొంగుకు ఒక ముడి వేసేది — వింతగా అనిపించినా, అది సాధారణంగా దొరికిపోయేదే.
అమ్మ కొంగులోని ఆ ముడి ఒక కదిలే బ్యాంకు లేదా లాకర్ లాంటిది; పిల్లల అదృష్టం బాగుంటే, అందులో దాగి ఉన్న కొన్ని నాణేలు మాయాజాలంలా బయటపడేవి కూడా. అమ్మ చీర కొంగు కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు — అది ఒక అద్భుతమైన అనుభూతి, ఒక భావోద్వేగం, ఒక ఆశ్రయం, మరియు ప్రేమతో నిండిన ఒక ప్రపంచం. నేటి తరం ఆ కొంగులోని వెచ్చదనాన్ని, దాని లోతైన అర్థాన్ని బహుశా ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు. ఇప్పుడు, అమ్మలు జీన్స్ ధరిస్తున్న ఈ రోజుల్లో...

**మరి ఆ "కొంగు" ఎక్కడి నుండి వస్తుంది?**

ప్రేమను, వెచ్చదనాన్ని, త్యాగాన్ని మరియు బాల్యపు లెక్కలేనన్ని మధుర స్మృతులను తనలో మోసుకున్న ప్రతి అమ్మ చీర కొంగుకు ఈ నివాళి.

## మొక్కజొన్న రైతులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన వైసీపీ నాయకులను అరెస్టు



- కూటమి ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్న పోలీసు యంత్రాంగం
- అక్రమ అరెస్టుల వలన రానున్న రోజుల్లో అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారు

**రేపల్లె మే 23మనసులోమాట:**
భారత రాజ్యాంగం లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన స్వేచ్ఛ స్వాతంత్రాలను వాక్ స్వాతంత్రాన్ని అబాస్ పాలు చేస్తున్న అధికారులుఅని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు శనివారం రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పీటా నాగ మోహన కృష్ణ పొన్నూరు నియోజకవర్గంలోని మామిళ్ళపల్లి గ్రామంలో మొక్కజొన్న రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తుంటే వారిని పరామర్శించేందుకు సంఘీభావం తెలిపేందుకు మోహన్ కృష్ణ వెళుతుంటే నిర్ధాక్షిణ్యంగా పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో మోహన్ కృష్ణను అడ్డగించి మీకు పరిమిషన్ లేదు వెళ్ళడానికి వీలు లేదు అని నిర్బంధించి పొన్నూరు పోలీస్ స్టేషన్కు తరలించడం అమానుషమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు కూ టమి ప్రభుత్వం నాయకుల మాటలు విని ప్రతిపక్ష పార్టీకి చెందిన వైసీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం పోలీసులకు తగదని ఎప్పుడు ఒకే పార్టీ అధికారంలో ఉండదని రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయం సాధించడం ఖాయమని అన్నారు కూటమి ప్రభుత్వానికి అధికారం పోతే ఇప్పుడున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన తెలియజేశారు పోలీసులు మోహనకృష్ణకు చెప్పినప్పటికీ నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా బలవంతంగా మోహనకృష్ణను జీపులో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లడం అక్కడ అరెస్టు చేయడం పోలీసుల దుర్మార్గపు చర్యకు నిదర్శనమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు అధికారులు రాజ్యాంగ విలువలను కాపాడాలని రాజ్యాంగం ద్వారానే మీకు అధికారం వచ్చిందని ఉద్యోగ అవకాశాలు కలిగాయని దానిని మరచి తప్పుడు దారిలో నడవడం సరికాదని ఆయన హెచ్చరించారు.

## ఇకపైమొదటి శనివారం జి.ఎస్.టి సమావేశం

**గుంటూరు, మే 23 (మనసులో మాట):**
జి.ఎస్.టి సమన్వయ సమావేశాన్ని ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ తెలిపారు. జి.ఎస్.టి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై జి.ఎస్.టి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం స్థిరంగా ప్రతి నెల మొదటి శనివారం నిర్వహిస్తామన్నారు. సభ్యులు అందరికీ ముందస్తు సమాచారం పక్కాగా అందించాలని ఆదేశించారు. అన్ని శాఖల నుండి అవసరమైన వివరాలను జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ స్వయంగా సమన్వయం చేయాలని సూచించారు. జి.ఎస్.టి సేకరణ పెంపుకు అవసరమైన



కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, జి.ఎస్.టి జాయింట్ కమిషనర్లు గీతా మాధురి, జాన్ స్టీఫెన్ సన్, ఇతర జి.ఎస్.టి అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన ఉచిత మజ్జిగ పంపిణీ

**భట్టిప్రోలు మే 23 మనసులో మాట:**
స్థానిక తమ్మన మల్లికార్జున రావు ఉన్నత పాఠశాల లో197677 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల కలయికతో భట్టిప్రోలుఅద్దేపల్లిలో ఏర్పాటుచేసిన ఉచితంగా మజ్జిగ పంపిణీ శనివారం నాటికి 11వ రోజుకు చేరింది.ఈ రోజు మజ్జిగ పంపిణి కార్యక్రమంను బీఎఫ్ ఏ ఈసీ సభ్యులు మాచర్ల వెంకటేశ్వరరావు చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీని ప్రారంభించి పలువురికి అందించారు. భట్టిప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని సిహెచ్ లలిత కుమారుడు రఘు పుట్టినరోజు




సందర్భంగా మజ్జిగ వితరణ చేశారు.ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసరావు, మాట్లాడుతూ 197677బ్యాచ్ విద్యార్థుల సేవలను కొనియాడారు. దాతలకు చలివేంద్రం నిర్వాహకులు పసుపులేటి శివరామ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు.

మనసులో మాట

# పరిసరాల పరిశుభ్రతోనే సంపూర్ణ ఆరోగ్యం..!

- క్లీన్ అండ్ గ్రీన్ కు దాతలు సహకరించాలి..!
- పారిశుధ్య కార్మికులకు నివేశ స్థలాలు..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి





**మాచర్ల: 23 మే (మనసులో మాట):** పరిశరాల పరిశుభ్రతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ క్లిన్ స్వీప్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు. చీపురు చేతబూని మున్సిపల్ సిబ్బంది, అధికారులు, కూటమి పార్టీల శ్రేణులతో రింగ్ రోడ్డు సెంటర్ నుంచి సాగర్ రోడ్డులో వ్యర్థాలను ఊడ్చి, శుభ్రం చేశారు. అనంతరం పరిశరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., పట్టణ పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. నెల రోజులు పాటు జరిగే ఆపరేషన్ క్లిన్ స్వీప్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అలానే మున్సిపాలిటి పరిధిలో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలను ఆధునీకరిస్తామని చెప్పారు.

**క్లీన్ అండ్ గ్రీన్ కు దాతలు సహకరించాలి..!**

మాచర్ల మున్సిపాలిటీ క్లీన్ అండ్ గ్రీన్ కు దాతలు సహకరించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గత పాలకుల మితిమిరిన అవినీతి మూలంగా మున్సిపాలిటీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఇంటి వ్యర్థాల సేకరణకు ప్రజలకు అవసరమైన ప్లాస్టిక్ డస్ట్ బిన్లను ఉచితంగా ప్రజలకు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సామాజీక బాధ్యతగా వ్యర్థాల సేకరణలో తమవంతు పాత్రపోషించాలని సూచించారు. అలానే పట్టణాన్ని క్లీన్ తో పాటు గ్రీనిష్ గా తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వచ్చే వర్షకాలంలో నాటికి గ్రీన్ సిటీకి అడుగులు పడతాయని చెప్పారు.

# నరసరావుపేట సబ్ జైలును సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి ఎం.గాయత్రి

- ఖైదీల సదుపాయాలు, వైద్య సేవలపై ఆరా
- ఉచిత న్యాయ సహాయంపై అవగాహన



**నరసరావుపేట మే 23 (మనసులో మాట):** నరసరావుపేట పట్టణంలోని సబ్ జైలును శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.గాయత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జైలు ఆవరణను, ఖైదీల బ్యారెక్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో ఆమె ముఖాముఖి మాట్లాడారు.ఖైదీలకు రోజువారీగా అందుతున్న భోజనం,తాగునీరు, వసతులు మరియు జైలు ప్రాంగణంలో పరిశుభ్రత తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీలకు అందుతున్న వైద్య సేవలు, అనారోగ్యంతో ఉన్న వారికి కల్పిస్తున్న చికిత్స వివరాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా జడ్జి గాయత్రి మాట్లాడుతూ ఖైదీలకు చట్టపరంగా ఉన్న హక్కులను వివరించారు.ఆర్థిక స్తోమత లేక లాయర్లను పెట్టుకోలేని నిరుపేద ఖైదీలకు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన ఖైదీల ఫిర్యాదుల పెట్టెను ఆమె స్వయంగా తెరిపించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ సురభి అంజయ్య, లీగల్ వాలంటీర్ లిఖిత, జైలు సిబ్బంది మరియు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# మహమ్మద్ మరణం కుటుంబానికి తీరనిలోటు





**చిలకలూరిపేట రూరల్ మే 23 మనసులో మాట:** చిలకలూరిపేట నియోజకవర్గం, పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ ఫరిసా గారి కుమారుడు మహమ్మద్ ఇటీవల మరణించగా పసుమర్రు గ్రామంలోని వారింటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.

# మంత్రి పొంగూరు నారాయణ ను కలిసిన యరపతినేని శ్రీనివాసరావు



**గురజాల, మే 23 ( మనసులో మాట ):** శనివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కలవడం జరిగింది. గురజాల కొత్త మున్సిపల్ బిల్డింగ్ కి రూ. 2 కోట్లు శాంక్షన్ చేశారు అని దాంట్లో ప్రస్తుతం పనుల నిమిత్తం కోటి రూపాయలు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి నారాయణ యరపతినేని కి హామీ ఇచ్చినట్లు సమాచారం.అలాగే గురజాల టౌన్ లోని సుంకర కుంట చెరువు ఆధునీకరణకు రూ.2.5 కోట్లు ప్రపోజల్ పెట్టాము అని దీనిని కూడా మంత్రి నారాయణ మంజూరు ఇస్తామని హామీ ఇచ్చినట్లు యరపతినేని చెప్పారు. అలాగే పెండింగ్ పనులకు అవసరమైన నిధులు శాంక్షన్ చేయాలని మంత్రి నారాయణ ను యరపతినేని కోరడం జరిగింది.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం లో పలువురు నాయకులు



**రేపల్లె మే 22మనసులోమాట:** రేపల్లె నియోజక వర్గం రేపల్లె మండలం చోడాయపాలెం గ్రామం లో ఉన్న _ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత,భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్*_ గారి 11 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం ఆనందించదగిన విషయమే అయినప్పటికీ ఆయన ఆచరణాలు పాటించటం ముఖ్యమన్నారు అంబేద్కర్ ఆశయాలు అనుకూలంగా పనిచేసుకోవాలని ప్రతి ఒక్కరు తమ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించాలని తెలియజేశారు మరియు అన్నదాన కార్యక్రమంలో పాల్గొరుమరియు వైఎస్ఆర్ స,కార్యకర్తలు.ఈ కార్యక్రమం లో గ్రామస్తుల మరియు అంబేద్కర్ యూత్ శ్రీ మోపిదేవి శ్రీనివాస రావు గారికి మేళాతాళాలు,పూలతో ఘనస్వాగతం పలికారు అనంతరం వైఎస్ఆర్సిపి రేపల్లె నియోజకవర్గం పీత మోహన్ కృష్ణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం లో పాల్గొని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు వీరి వెంట చిత్రాల ఓబేదు చి మట బాలాజీ వెంకట కృష్ణారెడ్డి చౌడయ్యపాలెంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు మోపిదేవి రాజీవ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.